● సాగరతీరంలో ఆరోగ్య యోగం

యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం మంగినపూడి బీచ్‌లో వెయ్యిమందితో యోగా నిర్వహించారు. యోగా ఆంగ్ల ఆకృతిలో ఆసనాలు వేశారు. ఈ కార్యక్రమంలో మంత్రి కొల్లు రవీంద్రతో పాటు ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు, కలెక్టర్ బాలాజీ, జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మ, ఎస్పీ గంగాధరరావు, యోగా సాధకులు పాల్గొన్నారు. 8



నేటి నుంచి రేషన్ షాపుల్లో సరుకుల పంపిణీ



- ఉదయం 8-12 వరకు, సాయంత్రం 4-8 గంటల వరకు..
- ఏ రేషన్ షాపులో అయినా తీసుకోవచ్చు : జేసీ 8

గృహయోగం ఎప్పటికో

జిల్లాలో పేదలకు టిడ్కో ఇళ్లు ఎప్పటికి అప్పగిస్తారో తెలియని పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఈ ఇళ్ల నిర్మాణానికి సంబంధించి బిల్లులు పెండింగ్‌లో ఉండటంతో కాంట్రాక్టర్లు పనులు నిలిపి వేశారు. ఏళ్ల తరబడి ఇళ్లు అందక లబ్ధిదారులు లబోదిబోమంటుంటే, ఈ ఇళ్ల కోసం నాడు ప్రభుత్వం తీసుకున్న రుణాలు చెల్లించాలంటూ బ్యాంకులు ఒత్తిడి చేస్తున్నాయి.



రుద్రవరం వద్ద టిడ్కో ఇళ్ల పరిస్థితి

పేదలకు ఇంకా అందని టిడ్కో ఇళ్లు

ఎక్కడి పనులు అక్కడే పెండింగ్

- రుద్రవరంలో 97 శాతం పనులు పూర్తి
- అయినా అప్పగించకుండా జాప్యం
- ఉయ్యూరులో 2019లోనే నిలిచిన పనులు
- బందరులోని గోసంఘం, గుడివాడలో ఇళ్ల అప్పగింత
- కనీస సౌకర్యాలు లేక లబ్ధిదారుల అవస్థలు

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : జిల్లాలో మొత్తం 13,712 ఇళ్లను గతంలో టీడీపీ ప్రభుత్వ హయాంలో ప్రారంభించారు. 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చాక రివర్స్ టెండరింగ్, లబ్ధిదారుల ఎంపికలో అవకతవకలు జరిగాయనే కారణాలు చూపించి పనులు నిలిపివేశారు. గుడివాడలో 7 వేల మందికి, మచిలీపట్నంలో 864 మందికి ఇళ్లు అప్పగించారు. మచిలీపట్నం రుద్రవరంలో టిడ్కో ఇళ్ల నిర్మాణం దాదాపు పూర్తయ్యే దశలో ఉన్నా బిల్లులు పెండింగ్‌లో ఉండటంతో కాంట్రాక్టర్ పనులు నిలిపివేశాడు. ఉయ్యూరులోని టిడ్కో ఇళ్ల నిర్మాణం 2019 నుంచి నిలిచిపోయే ఉన్నాయి. ఇక్కడ పనులుచేసే కాంట్రాక్టరుకు రూ.100 కోట్ల వరకు బిల్లులు పెండింగ్‌లోనే ఉన్నాయి.

బకాయిలు చెల్లించాలని బ్యాంకు నోటీసులు

టీడీపీ ప్రభుత్వ హయాంలో టిడ్కో ఇళ్ల నిర్మాణాలు, లబ్ధిదారుల ఎంపిక, వాటా చెల్లింపులు, వారి పేరున బ్యాంకు రుణాల మంజూరు వంటి ప్రక్రియ జరిగింది. గత ఆరేడేళ్ల క్రితమే లబ్ధిదారుల పేరున బ్యాంకు రుణాలు ఇవ్వడంతో వాటిని చెల్లించాలంటూ లబ్ధిదారులకు బ్యాంకు అధికారుల నుంచి నోటీసులు వస్తున్నాయి. వివిధ బ్యాంకుల సిబ్బంది లబ్ధిదారుల వద్దకు వెళ్లి టిడ్కో ఇళ్ల నిర్మాణం నిమిత్తం తీసుకున్న రుణాలు చెల్లించాలని ఒత్తిడి తెస్తున్నారు. తమకు ఇళ్లు ఇంకా అప్పగించలేదని, రుణాలు ఎలా చెల్లిస్తామని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. లబ్ధిదారుల ఖాతాల్లో వివిధ రూపాల్లో జమ అయిన నగదును రుణం చెల్లింపుల కింద బ్యాంకు అధికారులు జమ చేసుకుంటుండటంతో లబోదిబోమంటున్నారు.

రుద్రవరంలోని ఇళ్లను ఎప్పటికి అప్పగిస్తారో..

మచిలీపట్నం నియోజకవర్గంలోని రుద్రవరంలో చిన్నాపురం-మచిలీపట్నం రహదారి వెంబడి 3వేలకు పైగా టిడ్కో ఇళ్ల నిర్మాణ పనులు ప్రారంభించారు. వివిధ కారణాలతో వీటి సంఖ్యను 1,440కు తగ్గించారు. నాటి టీడీపీ ప్రభుత్వ హయాంలో 60 శాతం మేర పనులు పూర్తయ్యాయి. వైసీపీ ప్రభుత్వం వచ్చాక మూడేళ్లు పనులు నిలిపివేసి, తర్వాత ప్రారంభించారు. కిటికీలు, తలుపులు, విద్యుదీకరణ పనులు తుదిదశలో నిలిచిపోయాయి. ఈ గృహ సముదాయాలకు సంబంధించి గత ప్రభుత్వం రూ.3.50 కోట్ల బిల్లులను పెండింగ్‌లో పెట్టింది. ఈ బిల్లులు మంజూరు చేస్తే నెలలోపే పెండింగ్ పనులు పూర్తిచేస్తామని కాంట్రాక్టర్లు చెబుతున్నారు. 800 ఇళ్లకు సంబంధించి మిగతా 6లో..

అక్రమార్కులకు అధికారుల అండ

మట్టి, బుసక తవ్వకాల్లో భారీగా ఆమ్యామ్యాలు

- చూసీచూడనట్టు వదిలేస్తున్న అధికారులు
- రొయ్యూరులో ఓ వీఆర్వో చేతివాటం
- అక్రమ క్వారీ కోసం ఓ వైసీపీ నేతకు భూమి కేటాయింపు
- చూసీచూడనట్టు వదిలేస్తున్న మైనింగ్ అధికారులు



ఇటీవల పొట్టిదిబ్బలంకలో జరిగిన మట్టి తవ్వకాలు

తోట్లవల్లూరు, మే 31 (ఆంధ్రజ్యోతి) : మట్టి, బుసక అక్రమార్కులకు అధికారులు అండగా నిలుస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. నిబంధనలను ఉల్లంఘిస్తున్న అక్రమార్కులపై చర్యలు లేకపోవడంతో అక్రమ మైనింగ్‌కు అడ్డులేకుండాపోయింది. ఈనెల 15న పొట్టిదిబ్బలంకలో మట్టి అక్రమ తవ్వకాలు పట్టపగలు జరిగాయి. సుమారు 100 లారీల మట్టిని అక్రమంగా తరలించారు. మీడియా రాకతో వీఆర్వో నాగేశ్వరరావు వచ్చి మూడు లారీలను పట్టుకోగా, తెరవెనుక ఏం జరిగిందో ఆ తరువాత వదిలేశారు. అది దేవరపల్లి వెంకటేశ్వరరావు భూమిగా తేలింది. ఆ తర్వాత ఎలాంటి చర్యలు తీసుకోలేదు.

రొయ్యూరు క్వారీలో ఆగని అక్రమాలు

తాజాగా రొయ్యూరులో వైసీపీ నాయకుడు మూడున్నర ఎకరాల్లో అక్రమ బుసక క్వారీ నిర్వహించటం వివాదాస్పదమైంది. శుక్రవారం 'ఆంధ్రజ్యోతి'లో 'దర్జాగా బుసక దందా' శీర్షికన కథనం వచ్చిన విషయం తెలిసిందే. అయినా అధికారుల్లో చలనం లేదు. కథనం మిగతా 6లో..



భక్తులకు ఇబ్బందులు లేకుండా చూడాలి

- అధికారులతో సమీక్షలో దుర్గగుడి ఈవో శీనానాయక్ 6

రేపటి నుంచి ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ పరీక్ష

- పరీక్షకు హాజరుకానున్న 660 మంది అభ్యర్థులు
- నలందా విద్యానికేతన్‌లో పరీక్ష : డీఆర్‌వో నరసింహం 8



కట్టలేరులో ధ్వంసమైన చెక్‌డ్యామ్‌లు

చెక్‌డ్యామ్‌లు కట్టలేరా?

కట్టలేరుపై చెక్‌డ్యామ్‌ల నిర్మాణం ఎన్నటికో?

- 2019లోనే ప్రతిపాదనలు పంపినా పట్టించుకోరు
- పాత చెక్‌డ్యామ్‌లన్నీ ధ్వంసం.. వృథాగా పోతున్న నీరు
- ఏరులోని ఇసుకను తరలించేస్తున్న అక్రమార్కులు

తిరువూరు, సమీప గ్రామాల తాగు, సాగునీరుకు కీలకమైన కట్టలేరుపై చెక్‌డ్యామ్‌ల నిర్మాణం కలగానే మారింది. పాత చెక్‌డ్యామ్‌లు ధ్వంసం కావడంతో కొత్తవాటి నిర్మాణానికి 2019లోనే ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపగా, ఇప్పటివరకు అతీగతీ లేదు. మరోవైపు కట్టలేరులోని ఇసుకను అక్రమార్కులు దోచుకెళ్తుండటంతో ఈ ఏరు పరిసరాలు ఇసుక లేక పిచ్చిమొక్కలతో నిండిపోయాయి.


(ఆంధ్రజ్యోతి, తిరువూరు) : తిరువూరు పట్టణానికి సమీపంలోని ఖమ్మం జిల్లా నీలాద్రి గట్టు నుంచి ప్రవహించే నీరు లంకాసాగర్ డ్యామ్‌కు చేరి, అక్కడి నుంచి కట్టలేరు వాగుగా రూపాంతరం చెందుతుంది. తిరువూరు మీదుగా సుమారు 64 కిలోమీటర్ల మేర ప్రవహించే వాగు వీరులపాడు మండలం పల్లెంపల్లి, నందిగామ మండలం కూడలి వద్ద వైరా ఏరులో కలుస్తుంది. ఈ వాగు పరిసర ప్రాంతాల్లోని గ్రామాలకు తాగు, సాగునీరు సంవృద్ధిగా లభించేది. ప్రస్తుతం ఈ వాగులో గతంలో నిర్మించిన చెక్‌డ్యామ్‌లు ధ్వంసం కావడంతో నీరు వృథాగా పోతోంది. ఫలితంగా సరిహద్దు గ్రామాలకు మిగతా 6లో..

విజయవాడ పశ్చిమ బైపాస్ మరింత ఆలస్యం

మోర్తు నుంచి స్పష్టత రాకపోవడం వల్లే..

- ల్యాంకో అలైన్‌మెంట్ మార్పు అయితే లేదు
- ఎత్తు పెంపు విషయంలో తర్జనభర్జన
- కోర్టు కేసులు కొలిక్కి వచ్చాకే నిర్ణయం

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : విజయవాడ పశ్చిమ బైపాస్ ప్రారంభం కావటానికి మరింత సమయం పట్టే అవకాశం కనిపిస్తోంది. ల్యాంకో ట్రాన్స్‌మిషన్ హైటెన్షన్ టవర్ లైన్లకు సంబంధించి ఏం చేయాలన్న దానిపై కేంద్ర ఉపరితల రవాణా మంత్రిత్వ శాఖ (మినిస్ట్రీ ఆఫ్ రోడ్స్, ట్రాన్స్‌పోర్టు, హైవే.. మోర్తు) చైర్మన్ నుంచి స్పష్టత రాకపోవటంతో ఈ పరిస్థితి ఏర్పడింది. ప్రధాని నరేంద్రమోదీ అమరావతి పర్యటన సందర్భంలో మోర్తు చైర్మన్ పశ్చిమ బైపాస్‌ను పరిశీలించారు. ల్యాంకో ట్రాన్స్‌మిషన్ హైటెన్షన్ టవర్స్ లైన్‌కు సంబంధించి ఉన్న సమస్య గురించి తెలుసుకున్నారు. సమస్య పరిష్కారానికి మోర్తు ఇచ్చే డైరెక్షన్ ప్రకారం ఎన్‌హెచ్ అధికారులు ముందుకెళ్లాలి. అయితే, మోర్తు నుంచి ఇంకా స్పష్టత రాలేదు.



చిక్కుముడి వీడేనా?

ల్యాంకోలైన్ చిక్కుముడి అంశంపై ఎలాంటి ఆదేశాలు ఇవ్వాలన్న దానిపై మోర్తు ఓ నిర్ణయానికి రాలేకపోతోందని తెలుస్తోంది. ల్యాంకో లైన్‌కు సంబంధించి అనేక వివాదాలు ఉండటమే ఇందుకు కారణం. హైకోర్టుతో పాటు ఎన్‌సీఎల్‌టీలో అనేక కేసులు నడుస్తున్నాయి. ల్యాంకోలైన్ అలైన్‌మెంట్‌ను మార్చే విషయంలో కొండపల్లిలోని ల్యాంకో పవర్ ప్రాజెక్టు రన్నింగ్‌లో ఉన్నప్పుడు ఆ సంస్థతో ఒప్పందం చేసుకున్నారు. ఆ తర్వాత ల్యాంకో మూతపడింది. మూతపడిన క్రమంలో తలెత్తిన పరిణామాలు తెలిసిందే. ఈ అంశంపై కేంద్రానికి ఫిర్యాదులు అందటంతో చిక్కుముడిని ఎలా పరిష్కరించాలన్న అంశాన్ని మోర్తు తేల్చుకోలేకపోతోంది. న్యాయస్థానాలు, ఎన్‌సీఎల్‌టీలలో నడుస్తున్న కేసులను దృష్టిలో ఉంచుకుని ఇప్పుడు మోర్తు కూడా ఆలోచనలో పడింది. గతంలో ల్యాంకో మిగతా 6లో..



డబుల్ డెక్కర్ ఫ్లై ఓవర్ నిర్మాణం మెట్రోదే..

నిడమానూరు-రామవరప్పాడు వరకు..

- రామవరప్పాడు-మహానాడు బాధ్యతలు ఎన్‌హెచ్‌కు..
- ఏపీఎంఆర్‌సీ-ఎన్‌హెచ్ మధ్య కుదిరిన ఒప్పందం

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : నిడమానూరు నుంచి రామవరప్పాడు రింగ్‌రోడ్డు వరకు నిర్మించే డబుల్ డెక్కర్ నిర్మాణంపై ఓ స్పష్టత వచ్చింది. ఈ ఫ్లైఓవర్ నిర్మాణ పనులను ఏపీ మిగతా 6లో..



● పెన్షన్ పంపిణీ

జిల్లావ్యాప్తంగా శనివారమే పెన్షన్ల పంపిణీ జరిగింది. ఈ సందర్భంగా బందరు మండలం తాళ్లపాలెం సచివాలయ పరిధిలోని స్నేహాలయ వృద్ధాశ్రమంలో ఓ వృద్ధురాలికి పింఛన్ అందజేస్తున్న మంత్రి కొల్లు రవీంద్ర, కలెక్టర్ బాలాజీ, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు 8



● ప్రమాణ స్వీకారోత్సవం

ఏపీఎన్జీజీవో అధ్యక్షుడిగా విద్యాసాగర్ శనివారం ప్రమాణస్వీకారం చేశారు. అంతకుముందు సుమారు 500 బైకులు, వందకు పైగా కార్లు, వేలాది మంది ఉద్యోగులతో గాంధీనగర్‌లోని ఎన్జీజీవో హోమ్ నుంచి బందరు రోడ్డులోని శేషసాయి కల్యాణ మండపం వరకు ర్యాలీ నిర్వహించారు. 6

కనకదుర్గమ్మ సేవలో రెవెన్యూ స్పెషల్ చీఫ్ సెక్రటరీ జయలక్ష్మి


జయలక్ష్మికి అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న ఈవో శీనానాయక్

ఇంద్రకీలాద్రి, మే 31 (ఆంధ్రజ్యోతి) : దుర్గామల్లేశ్వర దేవస్థానంలో కనకదుర్గమ్మను శనివారం రాష్ట్ర రెవెన్యూ స్పెషల్ చీఫ్ సెక్రటరీ జి.జయలక్ష్మి కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. ఈవో వి.కె.శీనానాయక్ ఆలయ మర్యాదలతో ఆమెకు స్వాగతం పలికి అమ్మవారి దర్శనం కల్పించారు. అమ్మవారి దర్శనానంతరం వేదపండితులు ఆశీస్సులు అందజేశారు. ఈవో శీనానాయక్ లడ్డూ ప్రసాదం, చిత్రపటం, శేషవస్త్రం వారికి అందజేశారు.

భక్తులకు ఇబ్బందులు లేకుండా చూడాలి

● అధికారులతో సమీక్షలో ఈవో శీనానాయక్

ఇంద్రకీలాద్రి, మే 31 (ఆంధ్రజ్యోతి) : దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానంలో భక్తుల రద్దీ, పార్కింగ్ సమస్య పరిష్కారం, టోల్‌గేట్ నుంచి రథం సెంటర్ వరకు ఆక్రమణ విషయమై తగు చర్యలు తీసుకునేందుకు ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయం కోసం శనివారం దేవస్థాన మహామండపం నాల్గో అంతస్థులో ఈవో వి.కె.శీనానాయక్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈవో శీనానాయక్ భక్తులు ఎదుర్కొంటున్న పలు సమస్యలు వివరించారు. టోల్‌గేట్ వద్ద ట్రాఫిక్ సమస్య, దుర్గాఘాట్ ముందు, విజయేశ్వరస్వామి ఆలయం నుంచి రథం సెంటర్ వరకు ఆక్రమణలు వలన కలుగుతున్న ఇబ్బందులను వివరించారు. ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పని చేయాలని సూచించారు. ఆషాడ మాసం సారె సమర్పణకు, శాకంబరీ ఉత్సవాలు, శ్రావణ మాసంలో భక్తులకు ఇబ్బంది లేకుండా దర్శనం ఏర్పాటు చేయడానికి సహకరించాలని కోరారు. వెస్ట్ ఏసీపీ దుర్గారావు, వన్‌టౌన్ సీఐ గురు ప్రకాష్, ట్రాఫిక్ సీఐ, దేవస్థాన ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కోటేశ్వరరావు, వీఎంసీ అధికారులు పాల్గొన్నారు.

డీజీపీకి సీపీ శుభాకాంక్షలు


హరీష్‌కుమార్ గుప్తాకు శుభాకాంక్షలు తెలుపుతున్న సీపీ రాజశేఖర్‌బాబు

గుణదల, మే 31 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర డీజీపీగా పూర్తి బాధ్యతలు స్వీకరించిన హరీష్ కుమార్ గుప్తాను ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ ఎస్వీ రాజశేఖర్ బాబు శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. హరీష్‌కుమార్ గుప్తాకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా ఉండేందుకు పోలీసు శాఖ తీసుకుంటున్న చర్యలను అమలు చేయడంలో చిత్తశుద్ధితో పనిచేస్తామని డీజీపీకి ఈ సందర్భంగా సీపీ ఎస్వీ రాజశేఖర్‌బాబు తెలియజేశారు. డీజీపీని కలిసిన వారిలో డీసీపీలు కె.జి.సరిత, తిరుమలేశ్వర రెడ్డి, కె.ఎం.మహేశ్వరరాజు తదితరులు ఉన్నారు.


వినతిపత్రం అందజేసిన అనంతరం మంత్రి సత్యకుమార్ యాదవ్‌ను సత్కరిస్తున్న రాష్ట్ర ప్రభుత్వ వైద్యుల సంఘం నాయకులు

ఏపీఎంఈఎస్ వేతన స్కేల్ నుంచి విముక్తి కల్పించాలి : ప్రభుత్వ వైద్యుల వినతి

ప్రభుత్వాసుపత్రి, మే 31 (ఆంధ్రజ్యోతి) : వైద్య అధ్యాపకుల వేతనాలను గతంలో వలే యూజీసీ వేతనాలు గానే కొనసాగించాలని, బలవంతంగా రుద్దిన ఏపీఎంఈఎస్ వేతన స్కేలు నుంచి తమకు విముక్తి కలిగించాలని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌ను ప్రభుత్వ వైద్యుల సంఘం (జీడీఏపీ) ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు డాక్టర్ వి.వి.నారాయణరావు కలిసి విన్నవించినట్లు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఐ.బాబ్జిశ్యామ్ కుమార్ శనివారం తెలిపారు. సచివాలయంలోని చాంబర్‌లో మంత్రి సత్యకుమార్‌ను కలిసి సమస్యలు పరిష్కరించాలని వినతిపత్రం అందజేయగా, ఆయన సానుకూలంగా స్పందించి సమస్యలను పరిష్కరిస్తామని హామి ఇచ్చినట్లు తెలిపారు. స్వరూప్ కాంత్, డాక్టర్ మహేష్, భాను కుమార్, యాదవ్, రాజా మంత్రిని కలిసిన వారిలో ఉన్నారు.

ఉద్యోగుల వెన్నంటి ఉంటా

- పదవిని బరువుగా చూడను..బాధ్యతగా నిర్వహిస్తా
- సమస్యల పరిష్కారం కోసం చిత్తశుద్ధితో కృషి చేస్తా
- ఉద్యోగులు ఆకాంక్షలకు అనుగుణంగా కార్యాచరణ
- హక్కుల సాధనకు అవసరమైతే ఆందోళన బాట
- ఏపీ ఎన్జీజీవో అధ్యక్షుడు విద్యాసాగర్ హామీ


ఏపీ ఎన్జీజీవో అధ్యక్షుడిగా ప్రమాణస్వీకారం చేస్తున్న విద్యాసాగర్, గజమాలతో సత్కరిస్తున్న సంఘం నాయకులు

విజయవాడ, మే 31 (ఆంధ్రజ్యోతి) : ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం వారిని వెన్నంటే ఉంటానని ఏపీ ఏపీఎన్జీజీవో అధ్యక్షుడు ఆలపర్తి విద్యాసాగర్ అన్నారు. విజయవాడలోని శేషసాయి కల్యాణ మండపంలో ఏపీఎన్జీవో అధ్యక్షుడిగా శనివారం ఆయన ప్రమాణ స్వీకారం చేశారు. విద్యా సాగర్ మాట్లాడుతూ, గత 32 సంవత్సరాలుగా ఏపీ ఎన్జీజీవో సంఘంలో ఉద్యోగుల ఆదరాభిమానాలతో ఎన్నో పదవులు నిర్వహించానన్నారు. రాష్ట్రంలోని ప్రభుత్వ ఉద్యోగుల ఆకాంక్షలకు అనుగుణంగా తన కార్యాచరణ ఉంటుందన్నారు. పదవిని బరువుగా కాకుండా బాధ్యతగా నిర్వహిస్తానని పేర్కొన్నారు. ప్రభుత్వంతో సామరస్యపూర్వకంగా చర్చించి ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం చిత్తశుద్ధితో కృషి చేస్తానన్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు హక్కుగా పొందాల్సిన వాటి కోసం అవసరమైతే ఆందోళన బాట పడతానని హామీ ఇచ్చారు. తనకంటే ముందు ఈ పదవిని నిర్వర్తించిన నాయకుల పని తీరు గుర్తుపెట్టుకుని మరింత బాధ్యతతో ఉద్యోగుల సంక్షేమానికి కృషి చేస్తానన్నారు. దేశంలోని ఉద్యోగ సంఘాలలో ఏపీ ఎన్జీజీవో సంఘానికి ఉన్న పేరు ప్రతిష్ఠలను పెంచుతానన్నారు. ఇప్పటి వరకు అపరిష్కృతంగా ఉన్న సమస్యల పరిష్కారమే ప్రధాన లక్ష్యంగా ప్రభుత్వంతో చర్చించి సానుకూల ఫలితాలను అందిస్తానన్నారు.

విద్యాసాగర్‌కు ఎమ్మెల్యేలు బొండా ఉమా, గద్దె, ఎమ్మెల్సీ ఆలపాటి అభినందనలు

ప్రభుత్వ విప్, సెంట్రల్ నియోజకవర్గ శాసనసభ్యులు బొండా ఉమామహేశ్వరరావు, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్, తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్‌రావు ప్రమాణ స్వీకార కార్యక్రమంలో పాల్గొని నూతన నాయకత్వానికి అభినందనలు తెలిపారు.

ఉద్యోగ, ఉపాధ్యాయ, రిటైర్డ్ ఉద్యోగుల కోసం పెట్టిన తొలి సంఘం ఏపీ ఎన్జీజీవో అసోసియేషన్ అని, 74 సంవత్సరాల చరిత్ర, అనుభవం, 205 తాలూకా యూనిట్లు ఏపీ ఎన్జీజీవో సాధించిన ఘనత అన్నారు. సంఘం అంటే డిమాండ్ మాత్రమే కాదని, సంఘం అంటే భావజాలం కూడా ఉంటుందని నాయకులు గుర్తుంచుకోవాలని హితవు పలికారు. మాజీ అధ్యక్షుడు శ్రీరాములు వంటి వారు తమకి ఆదర్శమన్నారు. ఆర్థిక, ఆర్థికేతర ఫలితాలను పొందేలా తన పనితీరు ఉంటుందన్నారు. గడిచిన ప్రభుత్వంలో ఉద్యోగులు ఎవరూ కూడా స్వేచ్ఛగా మాట్లాడుకునే పరిస్థితి లేదని గుర్తు చేశారు. రాష్ట్రంలో ప్రభుత్వం మారిన తరువాత ఉద్యోగులు గొంతెత్తి తమ హక్కుల కోసం నినదిస్తున్నారని గుర్తు చేశారు. గత ప్రభుత్వ హయాంలో ఉద్యోగు లు ఎదుర్కొన్న ఎన్నో ఇబ్బందులను ప్రతి ఉద్యోగి గుర్తు పెట్టుకోవాలన్నారు. ఉద్యోగులకు దక్కాల్సిన ప్రయోజనాల విషయంలో ఎక్కడా రాజీ పడకుండా పోరాట మార్గాన్ని వదలబోనని అన్నారు. ప్రస్తుత ప్రభుత్వం ఉద్యోగులకు రావాల్సిన రూ.6700 కోట్ల బకాయిలను చెల్లించిందన్నారు. రాష్ట్ర నాయకత్వం ఇంతటితో సంతృప్తిపడే అవకాశం లేదన్నారు. ప్రస్తుతం ఉద్యోగులకు ప్రతినెలా నిర్ణీత సమయంలో జీతాలు వస్తున్నాయన్నది ప్రతి ఒక్కరూ గుర్తించాలన్నారు. ప్రభుత్వం ఏదైనా డిమాండ్ల సాధన మాత్రమే ఉద్యోగ సంఘ నాయకుల లక్ష్యం కావాలన్నారు. ఇప్పటి వరకు పెండింగ్‌లో ఉన్న మూడు డీఏలలో కనీసం ఒక్కటైనా అతి త్వరలో సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. అదే సమయంలో పీఆర్సీ కమిషన్ నియామకం సత్వరమే ఏర్పా టు చేయాలన్నారు. ఉద్యోగుల డిమాండ్ల మేరకు ప్రభుత్వం వేగంగా స్పందించాలని డిమాండ్ చేశారు. పూర్వ అధ్యక్షుడు కె.వి.శివారెడ్డి మాట్లాడుతూ, రాష్ట్రం లో ఎంతో పేరు ప్రతిష్ఠలు కలిగిన ఏపీ ఎన్జీజీవో సంఘానికి విద్యాసాగర్ వంటి నాయకుల అవసరం ఉందన్నారు. భవిష్యత్తులో ప్రభుత్వం నుంచి రావలసిన ప్రతి ప్రయోజనాన్ని ఉద్యోగులకు విద్యాసాగర్ అందించాలని ఆకాంక్షిస్తున్నానన్నారు.

భారీ ర్యాలీ

ప్రమాణస్వీకారానికి ముందు సుమారు 500 బైక్‌లు, వందకు పైగా కార్లతో గాంధీనగర్‌లోని ఎన్జీజీవో హోమ్ నుంచి బందరు రోడ్డులో ఉన్న శేషసాయి కల్యాణ మండపం వరకు వేలాది మంది ఉద్యోగులతో ర్యాలీ నిర్వహించారు. దారి పొడవునా ప్రభుత్వ ఉద్యోగుల ఉత్సాహం, కేరింతలు, బాణసంచా కాల్పుల మధ్య ప్రమాణ స్వీకార కార్యక్రమానికి చేరుకున్నారు. తనపై ఇంత ఆదరణ చూపుతున్నందుకు ప్రతి ఒక్కరికీ విద్యాసాగర్ ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పూర్వ రాష్ట్ర అధ్యక్షుడు పరుచూరి అశోక్‌బాబు, జి.పూర్ణచంద్రరావు, మాజీ నాయకులు రాధాకృష్ణమూర్తి, పూర్ణచంద్రరావు, చంద్రశేఖర్, రాష్ట్రంలో వివిధ జిల్లాలకు చెం దిన కార్యవర్గ సభ్యులు, ఉపాధ్యక్షులు, ఐదు వేల మందికి పైగా ఉద్యోగులు పాల్గొన్నారు.



ప్రజాదర్బార్‌లో మంత్రి కొల్లు రవీంద్రకు వినతి పత్రం ఇస్తున్న ఆటోవర్కర్ల సంఘం నాయకులు

సమస్యల సత్వర పరిష్కారమే లక్ష్యం : రవీంద్ర

మచిలీపట్నం టౌన్, మే 31 (ఆంధ్రజ్యోతి) : ప్రజా దర్బార్‌లో ప్రజల సమస్యలకు సత్వర పరిష్కరం చూపుతామని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. శనివారం మచిలీపట్నంలోని టీడీపీ కార్యాలయంలో శనివారం ప్రజాదర్బార్‌లో మంత్రి రవీంద్ర పాల్గొని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 96 మంది నుంచి వినతులు స్వీకరించారు. ఇళ్ల స్థలాలు, టిడ్కో ఇళ్లు, తెల్ల రేషన్ కార్డులు మంజూరు చేయాలని ఎక్కువ మంది వినతిపత్రాలు అందజేశారు. ఆటో నగర్ సమస్యలను పరిష్కరించాలంటూ ఆటోనగర్ సంక్షేమ సంఘం నాయకులు శ్రీరామ వెంకట దుర్గా ప్రసాద్, కొప్పినేని రాఘవులు, సురేంద్రప్రసాద్ విజ్ఞాపన అందజేశారు. ఆటోనగర్‌లో తాగునీరు, రోడ్లు , డ్రైనేజీ మెరుగు పరచాలని కోరారు. భారీ వర్షం కురిస్తే రోడ్లు ముంపునకు గురవుతున్నాయన్నారు. దివ్యాంగురాలై తన కుమార్తె త్రివేణిని ఆదుకోవాలని శారదానగర్ నుంచి వచ్చిన మహిళ కోరారు. మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ, ప్రజాదర్బార్‌లో వచ్చే అర్జీలను అధికారుల దృష్టికి తీసుకుని వెళ్లి పరిష్కరిస్తున్నామన్నారు. జూన్ 12వ తేదీ నుంచి 95 వేల మందికి కొత్త పింఛన్లు అందిస్తామన్నారు. రేషన్ కార్డులను సరిచేసి ఇస్తున్నామన్నారు. ప్రజల కోరిక మేరకు జూన్ 1వ తేదీ నుంచి చౌక డిపోల్లోనే రేషన్ పంపిణీ చేస్తామన్నారు. తమకు వీలయినప్పుడు వెళ్లి రేషన్ తీసుకోవచ్చన్నారు. దీపం పథకం కింద ఏడాదికి మూడు సిలిండర్లు ఉచితంగా ఇస్తున్నామన్నారు. పాఠశాలలు పునఃప్రారంభమయ్యే నాటికి తల్లికి వందనం కింద రూ.15 వేలు అందిస్తామన్నారు. సూర్యఘర్ పథకం కింద సబ్సిడీపై విద్యుత్ కనెక్షన్లు ఇస్తున్నామన్నారు. ఎన్టీఆర్ ఆరోగ్య సేవలు కింద మచిలీపట్నం అసెంబ్లీ నియోజకవర్గంలో ఇప్పటికి రూ.1.90 కోట్లు సీఎం సాయం అందించామన్నారు. టీడీపీ సీనియర్ నాయకుడు గొర్రెపాటి గోపీచంద్, కార్పొరేటర్ దేవరపల్లి అనిత, మచిలీపట్నం వ్యవసాయ మార్కెట్ యార్డు చైర్మన్ కుంచే నాని, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ గోపు సత్యనారాయణ, మునిసిపల్ మాజీ చైర్మన్ మోటమర్రి బాబా ప్రసాద్, నాయకులు పల్లపాటి సుబ్రహ్మణ్యం, బోయిన రాజు, కరెడ్ల సుశీల, బత్తిన దాసు, తలారి సోమశేఖర్, యువరాజ్, మచిలీపట్నం నగర టీడీపీ అధ్యక్షుడు లోగిశెట్టి వెంకటస్వామి, కార్యదర్శి బచ్చుల అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రెడ్‌బుక్ వల్ల ఏమీ జరగదు

● మాజీ మంత్రి పేర్ని నాని ● వైసీపీ ఇన్‌చార్జి వంశీనే



గన్నవరం, మే 31 (ఆంధ్రజ్యోతి) : రెడ్‌బుక్‌ను మడిచిపెట్టుకోండి. దాని వల్ల ఏమీ జరగదు. మహా అయితే నాలుగు రోజులు జైలులో పెడతారు.. అంతేగా అని వైసీపీ కృష్ణాజిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి పేర్ని నాని అన్నారు. గన్నవరం వైసీపీ కార్యాలయంలో శనివారం కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విలేకరులతో పేర్ని నాని మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ మీద తప్పుడు కేసులు పెడుతున్నారని ఆరోపించారు. బీజేపీ, టీడీపీ, జనసేన పార్టీలు మానవత్వాన్ని మరిచి వంశీ ఆరోగ్యాన్ని క్షీణింప జేసి ఏదో రకంగా అనారోగ్యంతో మరణించాలనే దుర్బుద్ధితో చేస్తున్నాయని ఆరోపించారు. వంశీ వాంతులు చేసుకుని స్పృహ లేకుండా పడిపోతుంటే, అంతా బాగుందని ప్రభుత్వ ఆస్పత్రి వైద్యు లు తప్పుడు రిపోర్టులు ఇచ్చారని ఆరోపించారు. భర్తని కాపాడుకునే పనిలో వంశీ భార్య పంకజశ్రీ ఉన్నారన్నారు. వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వంశీనేనని, 2029లో ఆయనే పోటీ చేసి ఎమ్మెల్యేగా గెలుస్తారని అన్నారు. జూన్ 4వ తారీఖున జరగనున్న వెన్నుపోటు దినం నిరసన కార్యక్రమంలో ఎక్కువ మంది పాల్గొనాల్సిందిగా కోరారు. మాజీ ఎమ్మెల్యేలు కైలే అనిల్‌కుమార్, సింహాద్రి రమేష్, నాయకులు పేర్ని కృష్ణమూర్తి, నీలం ప్రవీణ్‌కుమార్, శీలం రంగారావు, జడ్పీటీసీ సభ్యురాలు ఏఈ రాణి పాల్గొన్నారు.

నమూనా డీఎస్సీ నేడు : పీఆర్‌టీయూ

విజయవాడ, మే 31 (ఆంధ్రజ్యోతి) : విజయవాడలోని హోటల్ మురళీఫార్చ్యూన్ దగ్గర గల ప్రతిభానికేతన్‌లో ఆదివారం డీఎస్సీ నమూనా పరీక్ష నిర్వహిస్తున్నట్లు పీఆర్‌టీయు జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కోసూరి రాజశేఖర్, కార్యదర్శి కొనకళ్ల రమేష్‌బాబు ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి ఒంటిగంట వరకు పరీక్ష జరుగుతుందని తెలిపారు. నమూనా పరీక్ష రాసే అభ్యర్థులందరూ ఉదయం 9.30 గంటలకు పరీక్షా కేంద్రానికి చేరుకోవాలని సూచించారు. ప్రతిభ కోచింగ్ సెంటర్ సహకారంతో ఈ పరీక్షా ఫలితాలను వెంటనే ప్రకటించి విజేతలకు బహుమతులు అందిస్తామని తెలిపారు.

రోడ్డు ప్రమాద మృతులకు అంత్యక్రియలు పూర్తి

● ప్రముఖుల నివాళి

చల్లపల్లి, మే 31 (ఆంధ్రజ్యోతి) : ఊటీ విహారయాత్రకు వెళ్లి హైదరాబాద్ తిరిగి వెళుతూ తెలంగాణలో రోడ్డు ప్రమాదానికి గురై మృతి చెందిన తల్లీ కుమార్తెలు యర్ర శ్రావణి (35), సాయి చైత్ర (7)భౌతికకాయాలకు చల్లపల్లిలో శనివారం అంత్యక్రియలు నిర్వహించారు. చేనేత రంగ ప్రముఖులు యర్ర కోటమల్లయ్య మనుమడు యర్ర వెంకట బాబ్జీ హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా ఉద్యోగం చేస్తుండగా, కుటుంబ సభ్యులతో కలిసి విహారయాత్రకు వెళ్లి వస్తూ రోడ్డుప్రమాదానికి గురైన సంగతి తెలిసిందే. ఈ దుర్ఘటనలో భార్య, చిన్న కుమార్తె అక్కడికక్కడే మ రణించగా, పెద్దకుమార్తె హైదరాబాద్ ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. శవపరీక్ష అనంతరం భౌతికకాయాలను స్వగ్రామం చల్లపల్లి తీసుకురాగా, కుటుంబ సభ్యులు, బంధుమిత్రుల నివాళుల అనంతరం అంత్యక్రియలు నిర్వహించారు. చేనేత కుటుంబీకులు, బంధుమిత్రులు పెద్దఎత్తున భౌతికకాయాలను సందర్శించి నివాళులు అర్పించి బాబ్జీని పరామర్శించారు. ప్రమాద ఘటన బాధాకరమని మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు ఆవేదన వ్యక్తం చేశారు. భౌతికకాయాలను సందర్శించి నివాళులు అర్పించారు. భార్య, చిన్న కుమార్తెను కోల్పోయిన బాబ్జీని పరామర్శించి ఓదార్చారు. పెద్దకుమార్తె ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. గుండె నిబ్బరం చేసుకుని ధైర్యంగా ఉండాలన్నారు. ఆయన వెంట వైసీపీ నేతలు శీరం వెంకట సత్యనారాయణ, వెనిగళ్ల తారక జగదీష్, యడ్ల జగదీష్ తదితరులు ఉన్నారు. ఎంపీపీ కోట విజయరాధిక, పెద్దలు ఆకుల స్వభూప్రసాద్, టీడీపీ నేతలు రావి చిట్టి, రావి రాజేశ్వరరావు తదితరులు నివాళులు అర్పించిన వారిలో ఉన్నారు.

బాలికకు మహిళా కమిషన్ చైర్‌పర్సన్ పరామర్శ

మచిలీపట్నం టౌన్, మే 31 (ఆంధ్రజ్యోతి) : మచిలీపట్నంలో లైంగిక వేధింపులకు గురైన బాలికను, కుటుంబ సభ్యులను శనివారం రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ రాయపాటి శైలజ ఫోనులో పరామర్శించారు. బాధిత బాలికతో వీడియోకాల్‌లో మాట్లాడి శైలజ ధైర్యం నింపారు. ఎస్పీతో మాట్లాడి నిందితులకు శిక్షపడేలా చేస్తామని ఆమె హామీ ఇచ్చారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని అధికారులను ఆదేశించారు.

భార్యాభర్తలపై దుండగుల దాడి

మచిలీపట్నం టౌన్, మే 31 (ఆంధ్రజ్యోతి) : మచిలీపట్నంలో శనివారం తెల్లవారుజామున భార్యాభర్తలపై దుండగులు దాడి చేశారు. కాలేఖాన్‌పేటలోని శివగంగ గుడి సమీపంలో నివసిస్తున్న సాయిప్రసాద్, అతని భార్య ఉషారాణిలపై ముసుగులతో వచ్చిన దుండగులు కర్రలు, ఇనుపరాడ్‌లతో దాడి చేయడంతో వారు స్పృహ కోల్పోయారు. పక్కింటి వారు మచిలీపట్నం ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్చగా, ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సాయిప్రసాద్ పాలు అమ్ముతూ ఉంటాడు. వడ్డీ వ్యాపారం కూడా చేస్తుంటాడు. దాడి చేసిన వారెవరో తెలియరాలేదు. సీసీ టీవీ ఫుటేజ్‌లను ఎస్సై ఎస్ఐ సత్యనారాయణ పరిశీలిస్తున్నారు. సంఘటనా స్థలాన్ని డీఎస్పీ రాజా, ఇనకుదురు సీఐ పరమేశ్వరరావు సందర్శించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

డబుల్ డెక్కర్ ఫ్లై ఓవర్ నిర్మాణం మెట్రోదే..

(5వ పేజీ తరువాయి)

మెట్రో రైల్ కార్పొరేషన్ (ఏపీఎంఆర్‌సీ) మాత్రమే నిర్మించనుంది. ఈ మేరకు ఎన్‌హెచ్, ఏపీఎంఆర్‌సీ మధ్య అవగాహన కుదిరింది. కాగా, రామవరప్పాడు జంక్షన్ నుంచి మహానాడు జంక్షన్ వరకు సాధారణ ఫ్లై ఓవర్‌ను ఎన్‌హెచ్ నిర్మిస్తుంది.

ఇప్పటికి స్పష్టత

నిడమానూరు జంక్షన్ నుంచి మహానాడు జంక్షన్ వరకు రూ.600 కోట్లతో 7 కిలోమీటర్ల ఆరు వరసల ఫ్లై ఓవర్‌కు కేంద్ర ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చి ఏడాది కావస్తోంది. డీపీఆర్ కారణంగా జాప్యం జరిగింది. డీపీఆర్ వచ్చాక దీనికి టెండర్లు పిలుస్తారనుకున్న దశలో ఇదే అలైన్‌మెంట్‌లో మెట్రోలైన్ కూడా వస్తుండటంతో ఇబ్బందిగా మారింది. దీంతో ఏపీఎంఆర్‌సీ, ఎన్‌హెచ్ అధికారులు భేటీ కావాల్సి వచ్చింది. ఈ సమస్యను పరిష్కరించటానికి వీలుగా డబుల్ డెక్కర్ ఫ్లై ఓవర్ చేపట్టాలన్న ఆలోచన వచ్చింది. కింద రోడ్డు, పైన మొదటి ఫ్లై ఓవర్ మీద వాహనాలు, ఆ పైన మెట్రో ఎలివేటెడ్ కారిడార్ వస్తుంది. ఈ డబుల్ డెక్కర్ ఫ్లై ఓవర్‌కు సంబంధించి అంచనాలను ఏపీఎంఆర్‌సీ రూపొందించింది. డబుల్ డెక్కర్ ఫ్లైఓవర్‌కు 4.2 కిలోమీటర్ల మేర రూ.1,000 కోట్లు ఖర్చవుతుందని అంచనా వేసి ప్రతిపాదనలను మోర్త్‌కు పంపించారు. మోర్త్ నుంచి గ్రీన్‌సిగ్నల్ రావటమే ఆలస్యం. అయితే, డబుల్ డెక్కర్ ఫ్లై ఓవర్ ఎవరు చేపడతారన్న అంశంపై ఇప్పటికి స్పష్టత వచ్చింది. సింగిల్ ఫ్లై ఓవర్‌కు అయ్యే ఖర్చును ఎన్‌హెచ్ భరిస్తుంది. మెట్రో ఎలివేటెడ్ కారిడార్, డబుల్ డెక్కర్ పిల్లర్ల కోసం అయ్యే ఖర్చును ఏపీఎంఆర్‌సీ భరిస్తుంది. రామవరప్పాడు నుంచి మహానాడు వరకు అయ్యే సాధారణ ఫ్లై ఓవర్ ఖర్చును ఎన్‌హెచ్ భరిస్తుంది.

గృహయోగం ఎప్పటికో..

(5వ పేజీ తరువాయి)

పనులు పూర్తయినా లబ్ధిదారులకు ఇవ్వకుండా జాప్యం చేస్తున్నారు. ఈ ఇళ్లకు తాగునీటి అవసరాల నిమిత్తం నగరంలోని పంపులచెరువు నుంచి పైపులైన్ వేయడంతో పాటు ఓవర్‌హెడ్ ట్యాంకు, సంప్‌ల నిర్మాణ పనులు పూర్తయ్యాయి. సగం ఇళ్లకు మాత్రమే పైపులైన్ కనెక్షన్లు ఇచ్చారు. మిగతా పనులు ఎప్పటికి పూర్తిచేస్తారో ప్రశ్నార్థకంగా మారింది.

ఉయ్యూరులో పూర్తికాని పనులు

ఉయ్యూరు టౌన్ పరిధిలోని మూడు ప్రాంతాల్లో టిడ్కో ఇళ్ల నిర్మాణ పనులు గతంలో టీడీపీ ప్రభుత్వ హయాంలోనే ప్రారంభించారు. ఎల్‌అండ్‌టీ కంపెనీ ద్వారా ఈ పనులు చేస్తున్నారు. ఈ ఇళ్లకు సంబంధించి రూ.100 కోట్లకు పైగా బిల్లులను గత వైసీపీ ప్రభుత్వం పెండింగ్‌లో ఉంచింది. నిర్మాణం పూర్తిచేస్తామని ఎన్నికల ముందు కొద్దిరోజులపాటు హడావిడి చేసి రహదారుల పనులు కొంతమేర చేసినట్టుగా చూపించి ఆ తర్వాత ఆపేశారు. 2019వ సంవత్సరం నుంచి ఇక్కడి పనులు పూర్తిస్థాయిలో కాంట్రాక్టర్ నిలిపివేశాడు. ఎల్‌అడ్‌టీ కంపెనీ అమరావతి పనుల్లో బిజీగా ఉండటంతో ఉయ్యూరులోని ఇళ్ల నిర్మాణంపై అంతగా దృష్టిసారించలేదు.

మచిలీపట్నం గోసంఘంలో..

మచిలీపట్నంలో 6వేల మంది లబ్ధిదారులు టిడ్కో ఇళ్ల కోసం నగదు చెల్లించారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఈ ఇళ్ల సంఖ్యను 2,304కు తగ్గించారు. మచిలీపట్నంలో గోసంఘం వద్ద 864 ఇళ్లను ఈ ఏడాది ఫిబ్రవరిలో ఒకసారి, రెండు నెలల క్రితం మరోసారి లబ్ధిదారులకు అప్పగించారు. ఇక్కడ నిర్మించిన ఓవర్‌హెడ్ ట్యాంకు ద్వారా సరఫరా అయ్యే తాగునీరు చాలని పరిస్థితి ఏర్పడింది. వీధిలైట్లు సక్రమంగా వేయలేదు.

గుడివాడలో..

గుడివాడ పురపాలక సంఘం సరిహద్దున ఉన్న మల్లాయపాలెంలో 8,912 ఇళ్లు నిర్మించారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక ఇందులో కొంతమంది లబ్ధిదారుల పేర్లను అకారణంగా తొలగించారు. 2022 జూన్‌లో లబ్ధిదారులకు ఇళ్లు అప్పగించగా, వీరిలో 2వేల కుటుంబాలు కూడా నివాసం ఉండట్లేదు. తాగునీరు, ఇతర మౌలిక వసతులు ఇక్కడ లేకపోవడంతో నివాసం ఉండటానికి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కనీస సౌకర్యాలు కల్పించాలంటూ ప్రజలు టిడ్కో కాలనీ అసోసియేషన్ పేరుతో తరచూ ధర్నాలు చేస్తున్నారు. వీధిలైట్లు సక్రమంగా ఏర్పాటు చేయాలని స్థానికంగా నివాసం ఉండేవారు కోరుతుండగా, పనులు చేస్తామని చెబుతూ కాలయాపన చేస్తున్నారు. ట్యాంకర్ల ద్వారా తాగునీరు సరఫరా చేస్తున్నారు. వాడుక నీటి అవసరాల కోసం లబ్ధిదారులంతా తమ ఇళ్ల వద్ద బోర్లు వేయించుకుంటున్నారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో వివిధ కారణాలతో 2వేల మంది లబ్ధిదారులకు ఇళ్లు అప్పగించకుండా నిలిపివేశారు. పాతపేర్లు ఉన్నవారికే ఇళ్లు ఇస్తామని చెబుతున్నా, ఈ అంశంపై నేటికీ కదలిక లేదు. టిడ్కో ఇంటి రుణాల నుంచి లబ్ధిదారులకు విముక్తి కల్పిస్తామని ఎన్నికల సమయంలో రెండు ప్రధాన పార్టీల నాయకులు హామీ ఇచ్చారు. ఆ తర్వాత ఎవరూ పట్టించుకోలేదు.

చెక్‌డ్యామ్‌లు కట్టలేరా?

(5వ పేజీ తరువాయి)

తాగునీరు సక్రమంగా అందని దుస్థితి ఏర్పడింది.

ప్రతిపాదనలకే పరిమితం అవుతున్న చెక్‌డ్యామ్‌లు

కోకిలంపాడు వద్ద కట్టలేరు వాగుపై గతంలో బెడ్‌డ్యామ్ నిర్మించారు. ఈ డ్యామ్ నుంచి సప్లయి చానల్ నిర్మించారు. ఈ కాల్వ ద్వారా కోకిలంపాడు సాగుభూములు, లక్ష్మీపురం, అంజనేయపురం, చిట్యాలకు చెందిన భూములతో పాటు చెరువులకు నీరు చేరుతుంది. చిట్యాల బ్రిడ్జి సమీపంలో బెడ్‌డ్యామ్ నిర్మాణానికి ఇరిగేషన్ అధికారులు 2017-18లో సుమారు రూ.4.88 కోట్ల అంచనాతో బెడ్‌డ్యామ్ నిర్మాణం ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపారు. ఈ బెడ్‌డ్యామ్ నిర్మాణం వల్ల చిట్యాల, జగన్నాథపురం చెరువుకు సాగునీరు చెరడంతో సుమారు 400 ఎకరాలతో పాటు డ్యామ్ ఎగువబాగంలో సుమారు 500 ఎకరాలకు సాగునీరు అందుతుందనే అంచనా వేశారు. చిట్యాల బ్రిడ్జి వద్ద బెడ్‌డ్యామ్ నిర్మిస్తే అక్కడ నుంచి ఎత్తిపోతల పథకం ద్వారా పాతతిరువూరు, సూరవరం, రోలుపడి ప్రాంతాల్లోని భూములకు సాగునీరు అందించే ప్రతిపాదన సైతం తెరపైకి వచ్చింది. వాగుపై చిట్యాల, కనుమూరు, వినగడప వద్ద చెక్‌డ్యామ్‌ల నిర్మాణం ప్రతిపాదనలకే పరిమితం అవుతున్నాయనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. కాగా, కట్టలేరు వాగు అక్రమార్కుల చెరలో చిక్కింది. ప్రస్తుతం మండల పరిధిలోని వాగులో ఎక్కడ ఇసుక కనిపించని దయనీయ పరిస్థితులు నెలకొన్నాయి.

చెక్‌డ్యామ్‌లు నిర్మించండి

కట్టలేరు వాగులో ఇసుక అక్రమ తోలకాలు నిరోధించాలని, వాగులో అవసరమైన ప్రాంతాల్లో చెక్‌డ్యామ్‌లు నిర్మించడం వల్ల గ్రామాలకు తాగునీటితో పాటు సాగుభూములకు నీటి ఎద్దడి లేకుండా నివారించవచ్చని, ప్రభుత్వ ఆ దిశగా చర్యలు తీసుకోవాలని ఆయకట్టు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

చెక్‌డ్యామ్‌ల నిర్మాణానికి ప్రతిపాదనలు

తిరువూరు నుంచి గంపలగూడెం వరకు చెక్‌డ్యామ్‌ల నిర్మాణానికి 2019లోనే ప్రతిపాదనలు పంపాం. రూ.18 కోట్లతో కట్టలేరుపై చిట్యాల, చింతలపాడు, గానుగపాడు, గంపలగూడెం మండలం వినగడప, కనుమూరు, అనుముల్లంక వద్ద చెక్‌డ్యామ్‌ల నిర్మాణం, పడమటి వాగుపై ఒక చెక్‌డ్యామ్ నిర్మాణానికి పంపిన ప్రతిపాదనలకు అనుమతి రాలేదు.

- కిషోర్, ఏఈ-ఇరిగేషన్, తిరువూరు

అక్రమార్కులకు అధికారుల అండ

(5వ పేజీ తరువాయి)

వచ్చిన రోజే సదరు వైసీపీ నాయకుడు దర్జాగా ఎక్స్‌కవేటర్‌ను బయటకు తెచ్చుకునే అవకాశం కల్పించారు. రొయ్యూరులో వైసీపీ నేత అక్రమ బుసక క్వారీకి ఓ వీఆర్వో 3.30 ఎకరాలు ఇచ్చినట్టు తెలిసింది. అధికారులకు అర్జీ పెట్టి అనుమతి లభించకుండానే, వీఆర్వో బుసక క్వారీ ఏర్పాటుకు కృష్ణానదీపాయలోని భూములను ఇవ్వటంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ వ్యవహారంలో ఆ వీఆర్వో ముందుగానే రూ.లక్షలు సొమ్ము చేసుకున్నట్టు చెబు తున్నారు. బుసక భూములకు, బాటకు, అధికారుల ముడుపులకు రూ.17.50 లక్షలు ఖర్చుచేసి నిండా మునిగామని సదరు వైసీపీ నేత ఇప్పుడు అధికార పార్టీ నేతల చుట్టూ తిరుగుతూ మళ్లీ అక్రమ బుసక క్వారీ తెరిచేందుకు సన్నాహాలు చేసుకుంటున్నట్టు సమాచారం. ఈ క్వారీకి అధికార పార్టీకి చెందిన ప్రజాప్రతినిధి కూడా సహకరించారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

మైనింగ్ అధికారుల ముడుపుల మాయ

ఎక్కడ అక్రమ మైనింగ్ జరిగినా సంబంధిత అధికారులు స్పందించి, చర్యలు చేపట్టి, అక్రమార్కులను గుర్తించి జరిమానా విధించాలి. కానీ మైనింగ్ అధికారులు శుక్రవారం మండలానికి వచ్చి రొయ్యూరు క్వారీకి వెళ్లకుండా భద్రిరాజుపాలెం, దేవరపల్లి వెళ్లినట్టుగా తెలిసింది. మైనింగ్ అధికారులు అసలు దోషులను రక్షించేలా నడుచుకోవటం వెనుక భారీగా ముడుపుల వ్యవహారం నడిచిందనే ఆరోపణలు వస్తున్నాయి. వైసీపీ ప్రభుత్వ హయాంలో చక్రం తిప్పిన ఓ మైనింగ్ అధికారి నేటికీ ఈ వ్యవహారాలను గుప్పెట్లో పెట్టుకున్నట్టు తెలుస్తోంది. శుక్రవారం సదరు అధికారికి 'ఆంధ్రజ్యోతి' ఫోన్ చేసినా స్పందించలేదు. తనిఖీల విషయాన్ని తహసీల్దార్ ఎం.కుసుమకుమారిని అడగ్గా, తనకు తెలియదని చెప్పారు. దీంతో మైనింగ్, రెవెన్యూ అధికారుల మధ్య సమన్వయలోపం ఉందని స్పష్టమవుతోంది.

పశ్చిమ బైపాస్ మరింత ఆలస్యం

(5వ పేజీ తరువాయి)

యాజమాన్యంతో కుదుర్చుకున్న ఒప్పందం, అది మూతపడిన తర్వాత రాధ వాసవితో ఎలా ముడిపడిందన్నది కీలకంగా మారుతోంది. ల్యాంకో లేకపోతే.. దానిని ఆధీనంలోకి తీసుకున్న లిక్విడేటర్‌తో కాకుండా రాధాతో సంప్రదింపుల వ్యవహారం నడపటం వల్లే రైతుల వివాదం తలెత్తింది. ల్యాంకోలైన్ విద్యుత్ అంతరాయం కోసం గతంలో రాధా సంస్థకు ఎన్‌హెచ్ అధికారులు లేఖ రాయడంతో ఆ సంస్థ కోర్టుకు వెళ్లి స్టే తెచ్చుకుంది. తనది కాని లైన్‌కు సంబంధించి రాధా సంస్థ ఏకంగా హైకోర్టుకు వెళ్లడం చర్చనీయాంశంగా మారింది. ఈ నేపథ్యంలో కలెక్టర్ లక్ష్మీశ అధ్యక్షతన రైతులతో నిర్వహించిన సమావేశంలో ఈ వివాదాన్ని పక్కనపెట్టి అలైన్‌మెంట్‌ను రైతుల పొలాల మీదుగా కాకుండా, ఇప్పుడున్న ప్రాంతంలోనే టవర్ల ఎత్తు పెంపుదలకు సంబంధించిన నిర్ణయం జరిగింది. తమకు అభ్యంతరం లేదని, సహకరిస్తామని రైతులు కూడా చెప్పారు. జిల్లా యంత్రాంగం స్థాయిలో ఓ అంగీకారం కుదిరినప్పటికీ మోర్త్ స్థాయిలో ఇంకా స్పష్టత రాలేదు. అలైన్‌మెంట్‌ను మార్చే ఉద్దేశం మోర్త్‌కు లేదని తెలుస్తోంది. టవర్ల ఎత్తును పెంచాలా? టవర్ల వైర్లను తొలగిం చాలా? అనే ఆలోచన కూడా చేస్తున్నట్టు తెలుస్తోంది. టవర్ల లైన్లను బ్రేక్ చేస్తే కనుక రాధా సంస్థతో సమస్య వచ్చే అవకాశం ఉంది. ఎందుకంటే ఆ సంస్థ ఈ లైన్‌కు సంబంధించి స్టే తెచ్చుకుంది. కోర్టు ఆదేశాలకు విరుద్ధం గా వెళ్లినట్టే అవుతుంది. రాధా తనది అని వాదిస్తున్న వైర్లను కాకుండా కింది వైర్లను బ్రేక్ చేస్తే.. విజయవాడ పశ్చిమ బైపాస్ రోడ్డు పనులకు ఎలాంటి ఇబ్బంది ఉండదు. హైటెన్షన్ టవర్‌లో మూడు లేయ ర్లుగా విద్యుత్ లైన్లు ఉంటాయి. కింది వరసలోని లైన్లను తొలగించినా, ఇప్పుడున్న టవర్ల ఎత్తు పెంచకపోయినా సరిపోతుందని తెలుస్తోంది. ఇలాంటపుడు సమస్యను తేలిగ్గా పరిష్కరించే అవకాశాలు ఉన్నాయి. ఏది మంచి విధానం అనే దానిపై మోర్త్ అంచనాకు రాలేకపోతోంది. దీని వల్ల పశ్చిమ బైపాస్ అందుబాటులోకి రావటానికి మరికొంత సమయం పట్టే అవకాశం ఉంది.

బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	122, 131, 142
చికెన్ విత్ స్కిన్	234
చికెన్ స్కిన్‌లెస్	244

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 510

నర్సింగ్ విద్యార్థినికి ప్రోత్సాహక బహుమతి



ఉయ్యూరు, మే 31 (ఆంధ్రజ్యోతి) : లక్ష్యాన్ని నిర్దేశించుకుని కృషి, పట్టుదలతో కష్టపడి చదివి ఉన్నతస్థాయికి చేరుకోవాలని రోటరీక్లబ్ అధ్యక్షుడు చొప్పరపు నాగసుబ్రమణ్యం అన్నారు.బీఎస్సీ నర్సింగ్ విద్యార్థిని డి.హేమకు ప్రోత్సాహక బహుమతిగా దాత జి. బసంతి సమకూర్చిన రూ. 10వేల నగదు రోటరీక్లబ్ ద్వారా సుబ్రమణ్యం శనివారం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, విద్యాభివృద్ధికి రోటరీక్లబ్ ముందుంటుందన్నారు. కేసీపీ జనరల్ మేనేజర్ వీవీ పున్నారావు, రోటరీ సెక్రటరీ అమీర్ మీర్జా, పాస్ట్ అసిస్టెంట్ గవర్నర్ సయ్యద్ అనీస్ అభినందించారు.





పెనమలూరులో పింఛన్ల పంపిణీలో మారుపూడి ధనకోటేశ్వరరావు, కోయ ఆనంద్‌ప్రసాద్.. కాటూరులో దండమూడి చౌదరి

అర్హులందరికీ పింఛన్లు

ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు

విజయవాడ రూరల్, మే 31 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర వ్యాప్తంగా అర్హులందరికీ కూటమి ప్రభుత్వం పింఛన్లులు అందిస్తుందని ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. విజయవాడ రూరల్ మండలం అంబాపురంలో శనివారం జరిగిన పింఛన్ల పంపిణీ కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే స్వయంగా పలువురికి పింఛన్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జూన్ 1న ఆదివారం సెలవుదినం కావడంతో ఒక రోజు ముందుగానే పింఛన్‌లు అందజేయడం జరుగుతుందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత దివ్యాంగుల పింఛన్ రూ.3వేలు నుంచి రూ.6వేలుకు, వృద్ధాప్య, వితంతు పింఛన్‌లు రూ. 3వేలు నుంచి రూ.4వేలు పెంచి వారికి ఆర్థిక భరోసా ఇవ్వడం జరిగిందన్నారు. ఇంకా అర్హత ఉండి పింఛన్‌లు రాని వాళ్లకు త్వరలోనే పింఛన్‌లు అందేలా చూస్తాని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో విజయవాడ రూరల్ మండలం టీడీపీ అధ్యక్షుడు గొడ్డళ్ళ చినరామారావు, గ్రామ సర్పంచ్ గడికోట సీతయ్య, నేతలు గంపా శ్రీనివాస్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

పెనమలూరు : మండలంలో పింఛన్ల పంపిణీ సంబరాలు ఒక రోజు ముందే ప్రారంభమయ్యాయి. పెనమలూరులో జరిగిన పంపిణీ కార్యక్రమాన్ని టీడీపీ సీనియర్ నేత మారుపూడి ధనకోటేశ్వరరావు, టీడీపీ మండలాధ్యక్షుడు కోయ ఆనంద్‌ప్రసాద్, గ్రామ అధ్యక్షుడు తోటకూర భాస్కర్, చిగురుపాటి శ్రీనివాస్, గూడవల్లి పూర్ణ, యలమంచిలి ప్రసాద్ తదితరులు పర్యవేక్షించారు. తాడిగడప మునిసిపాలిటీలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని టీడీపీ తాడిగడప మునిసిపాలిటీ అధ్యక్షుడు అనుమోలు ప్రభాకరరావు, బోడె సురేష్, జనసేన అధ్యక్షుడు తాతపూడి గణేష్, పీతా గోపీచంద్, బోడె సురేంద్రలు పర్యవేక్షించారు. యనమలకుదురులో జరిగిన పంపిణీ కార్యక్రమాన్ని రాష్ట్ర గౌడ వెల్ఫేర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ శొంఠి శివరాంప్రసాద్ స్థానిక సచివాలయ అధికారులతో పాల్గొని లబ్ధిదారులకు పంపిణీ చేశారు.



అంబాపురంలో పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే యార్లగడ్డ

ఉయ్యూరు : ఎన్నికల హామీ మేరకు సామాజిక పింఛన్లు రూ. 4వేలకు పెంచి కూటమి ప్రభుత్వంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎన్టీఆర్ భరోసా పింఛన్లు అందజేస్తున్నారని తెలుగు యువత జిల్లా అధ్యక్షుడు దండమూడి చౌదరి అన్నారు. కాటూరులో శనివారం ఎన్టీఆర్ భరోసా పింఛన్లను ఎంపీటీసీ సజ్జా అనూష, పార్టీ నాయకులతో కలసి పంపిణీ చేశారు. వేమూరు శ్రీనివాసరావు, ఆకునూరు సర్పంచ్ గోలి వసంతకుమార్, పార్టీ నాయకులు యుగబాబు, శరత్‌కుమార్, హరీశ్, లక్ష్మీనారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హనుమాన్‌జంక్షన్ : ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు బాపులపాడులో ఒక రోజు ముందుగానే నిర్వహించారు. బాపులపాడులో శనివారం పంచాయతీ సిబ్బంది నిర్వహించిన కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు అట్లూరి శ్రీనివాస్ పాల్గొన్నా రు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ చిత్తశుద్ధితో అమలు చేసిన ఘనత చంద్రబాబు నాయుడుకే దక్కుతుందన్నారు. ఈకార్యక్రమంలో నాయకులు మొవ్వా వేణుగోపాల్, చీలి ఆనంద్, తదితరులు పాల్గొన్నారు.

హనుమాన్‌జంక్షన్‌రూరల్ : పెన్షన్లను సకాలంలో అందిస్తూ వృద్ధులకు, దివ్యాంగులకు ప్రభుత్వం అండగా నిలుస్తోందని టీఎన్‌టీయూసీ నాయకుడు బి.పాండురంగారావుఅన్నారు. ఉమామహేశ్వరపురంలో వృద్ధులకు శనివారం పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఆర్నేపల్లి సూరిబాబు, వెంకన్నతో కలిసి ఆయన పాల్గొన్నారు.

వెల్లింగ్‌టన్‌లో ఎమ్మెల్యే బోడె దంపతులకు ఘన స్వాగతం



పెనమలూరు, మే 31 (ఆంధ్రజ్యోతి) : విదేశీ టూర్‌లో భాగంగా స్థానిక ఎమ్మెల్యే బోడె ప్రసాద్, సతీమణి హేమ చౌదరిలు శనివారం న్యూజిలాండ్ రాజధాని వెల్లింగ్‌టన్ పట్టణానికి చేరుకొన్నారు. అక్కడి విమానాశ్రయంలో ప్రవాస భారతీయులు బోడె దంపతులకు సాదర స్వాగతం పలికారు.

అనుమతులు లేని కట్టడాలకు నోటీసులు

పెనమలూరు, మే 31 (ఆంధ్రజ్యోతి) : పెనమలూరులో భవన నిర్మాణ అనుమతులు తీసుకొని అనుమతులు ఉల్లంఘించి నిర్మించిన భవన యజమానులు 220మందికి పంచాయతీ కార్యాలయం నుంచి నోటీసులు అందజేస్తున్నారు. గతంలో గ్రామస్థుడు ముప్పాళ్ల బదరీనారాయణ సమాచార హక్కు చట్టం ద్వారా గ్రామంలో సరైన అనుమతులు లేని కట్టడాలపైచర్యల గురించి సీఆర్డీయే కమిషనర్‌ను కోరగా వెంటనే స్పందించిన ఆయన యజమానులపై తగు చర్యలకు ఆదేశించారు. దీంతో పంచాయతీ అధికారులు గ్రామంలోని 220 ఇళ్ల యజమానులకు నోటీసులు జారీ చేస్తున్నారు.

కానూరులో చెస్ క్రీడాసంబరాలు నేటి నుంచి



విజయవాడ(స్పోర్ట్స్), మే 31 (ఆంధ్రజ్యోతి): వారం రోజుల పాటు చెస్ క్రీడాసంబరాలు నిర్వహిస్తున్నట్లు స్కాట్స్‌పైన్ స్కూల్ ప్రిన్సిపాల్ చలసాని ప్రతిమ తెలిపారు. కానూరులోని స్కూల్ అవరణలో జూన్1 నుంచి 6వ తేదీ వరకు నిర్వహించనున్న చెస్ పోటీలు, కోచింగ్ క్యాంపు, ట్రైనింగ్ క్యాంప్‌ల బ్రోచర్ ఆవిష్కరణ కార్యక్రమం శనివారం జరిగింది. కార్యక్రమంలో ఆంధ్రా చెస్ అసోసియేషన్ కార్యనిర్వాహక కార్యదర్శి ఎన్.ఎం.ఎఫ్.ఫణి కుమార్, స్కూల్ ఫిజికల్ డైరెక్టర్ ఎన్.శివ, ఎస్ఆర్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ డైరెక్టర్ పి.రేణుక, కృష్ణాజిల్లా చెస్ అసోసియేషన్ మేనేజర్‌లు ఎ.మణిరత్నం, పి.రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

నటుడు కృష్ణ జయంతి

గన్నవరం, మే 31 (ఆంధ్రజ్యోతి) : స్థానిక బాలుర హైస్కూల్ క్రీడా ప్రాంగణంలో ప్రముఖ సినీనటుడు సూపర్‌స్టార్ కృష్ణ జయంతిని శనివారం నిర్వహించారు. కృష్ణ ఫ్యాన్స్ అసోసియేషన్ నాయకులు ఎంవీ గిరి, ఏవీరావుల ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి దుస్తులను పంపిణీ చేశారు. సర్పంచ్ నిడమర్తి సౌజన్య, వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కేవీఆర్ కిషోర్, న్యాయవాది తిరివీధి వెంకయ్య, నిడమర్తి వెంకటేశ్వరరావు, రాజేష్, శోభనాద్రి, వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.



దుస్తులు పంపిణీ చేస్తున్న సర్పంచ్ సౌజన్య

రేపటి నుంచి ముస్తాబాద-సావరగూడెం

రైల్వే గేటు మూసివేత

గన్నవరం, మే 31 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ముస్తాబాద-సావరగూడెం గ్రామాల మధ్యలో ఉన్న రైల్వే గేటును జూన్ 2 నుంచి 9వ తేదీ వరకూ మూసివేస్తున్నట్లు రైల్వే అధికా రులు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రైల్వే గేటు దగ్గర ట్రాక్ అత్యవసర మరమ్మతుల నిమిత్తం గేటును మూసి వేస్తున్నామని ప్రయాణికులు, రైతులు, ప్రజలు సహకరించాలని కోరారు.



రేషన్ షాపు తనిఖీ చేస్తున్న తహసీల్దార్ సురేశ్‌కుమార్

రేషన్ పంపిణీ సక్రమంగా జరగాలి

ఉయ్యూరు, మే 31 (ఆంధ్ర జ్యోతి) : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన రేషన్‌షాపుల వద్ద నిత్యావసర సరుకుల పంపిణీ సక్రమంగా జరగాలని మండల తహసీల్దార్ ఎం.సురేశ్‌కుమార్ రేషన్ డీలర్లకు సూచించారు. ఉయ్యూరులో గాంధీసదన్ సమీపాన రేషన్ షాపును శనివారం తనిఖీ చేశారు. రేషన్‌కార్డుల లబ్ధిదారులకు నిత్యావసర సరుకులు ఆదివారం నుంచి షాపుల వద్దే పంపిణీ జరుగుతుందని, షాపులకు రాలేని దివ్యాంగులకు ఇంటి వద్దకే సరుకులు తీసుకువచ్చి డీలర్ అందజేస్తారన్నారు.



అభయాంజనేయస్వామిని దర్శించుకున్న గణేష్‌కుమార్, సత్యవతి దంపతులు

కొప్పుల వెలమ సంఘీయుల అభ్యున్నతికి కృషి

కార్పొరేషన్ చైర్మన్ గణేష్‌కుమార్

హనుమాన్‌జంక్షన్‌రూరల్, మే 31 (ఆంధ్రజ్యోతి) : బీసీలకు సముచిత ప్రాధాన్యత ఇస్తూ వారి అభివృద్ధికి ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తున్నదని కొప్పుల వెలమ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ గణేష్‌కుమార్ అన్నారు. హనుమాన్‌జంక్షన్ అభయాంజనేయస్వామి దేవస్థానంలో గణేష్‌కుమార్ దంపతులు శనివారం ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కానుమోలు మాజీ సర్పంచ్ చింతల వెంకట శివ అప్పారావు, టీడీపీ నాయకులు వేగిరెడ్డి పాపారావు, బాలాజీ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



ఉప్పలూరులో బుడమేరును పరిశీలిస్తున్న సీపీఐ నేతలు

ఆపరేషన్ బుడమేరు ఏమైంది?

సీపీఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దోనేపూడి శంకర్

కంకిపాడు, మే 31 (ఆంధ్రజ్యోతి) : అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ బుడమేరు ఏమైందని సీపీఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దోనేపూడి శంకర్ ప్రశ్నించారు. మండలంలోని ఉప్పలూరు బుడమేరు కాలువను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా దోనేపూడి శంకర్ మాట్లాడుతూ, గత ఏడాది వచ్చిన వరదల కారణంగా బుడమేరు పొంగిపొర్లి మండలంలోని వేల్పూరు, ఉప్పలూరు, మంతెన, తెన్నేరు గ్రామాల పరిధిలోని రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. మళ్లీ వరదలు వస్తే రైతులు తీవ్రంగా నష్టపోతారన్నారు. కనీసం గుర్రపు డెక్క పూడిక, తూటి కాడలు తొలగించలేదన్నారు. ఆపరేషన్ హైడ్రా మాదిరిగా ఆపరేషన్ బుడమేరును కూటమి ప్రభుత్వం చేపట్టాలన్నారు. రాష్ట్రంలో మాటల ప్రభుత్వం తప్ప చేతల ప్రభుత్వం కాదన్నారు. ఆపరేషన్ బుడమేరు చేపట్టాలని కోరుతూ జూన్ 6వ తేదీన నిపుణులతో, రైతులతో ఇతర పార్టీల నాయకులతో ఏర్పాటు చేసిన రౌండు టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు, రైతులు పాల్గొన్నారు.



యోగా శిక్షణ

ఉయ్యూరు, మే 31 (ఆంధ్రజ్యోతి) : పదకొండవ అంతర్జాతీయ యోగా దినోత్సవ శిక్షణ కార్యక్రమంలో భాగంగా మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎంపీడీవో శేషగిరిరావు ఆధ్వర్యంలో శనివారం యోగా శిక్షణ నిర్వహించారు. యోగా సాధకులు జి.కృష్ణ, టి.సుస్మిత, జి.నళిని పాల్గొన్నారు.

వర్షాల వెంట.. ఆశల పంట.!

ముందస్తు వర్షాలతో అన్నదాతల్లో హర్షాతిరేకాలు

- ఖరీఫ్ ప్రణాళికతో వ్యవసాయ, ఉద్యాన శాఖ అధికారులు
- పొలాలు సిద్ధం చేస్తున్న అన్నదాతలు



పత్తి విత్తనాలు నాటేందుకు అచ్చులు తోలి సిద్ధం చేసిన పొలం

ఆంధ్రజ్యోతి, ఇబ్రహీంపట్నం: ఈ ఏడాది నైరుతి రుతుపవనాలు కేరళను త్వరగా తాకడంతో వర్షాలు విస్తారంగా పడి వాతావరణం చల్లబడింది. ఈ ఖరీఫ్‌లో ముందస్తు వర్షాలతో అన్నదాతల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. మరికొద్ది రోజుల్లో సాగు ప్రారంభం కానున్న నేపథ్యంలో అన్నదాతలు ఎంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు. రోజు మార్చి రోజు వర్షాలు పడుతుండటంతో ఈఏడాది సాగుకు వర్షాలు బాగా ఉపయోగపడతాయనే ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. సాధారణంగా జూన్ రెండో వారం నుంచి జూలై నెలాఖరు వరకు పడే వర్షాలతో వాగులు కదిలి వరదలు వచ్చి చెరువులు నిండటం ముమ్మరంగా వ్యవసాయ పనులు ప్రారంభమవ్వడం జరుగుతుంది. కానీ ఈఏడాది ముందస్తుగా తొలకరి పలకరించడంతో ముందుగానే సాగు ప్రారంభమయ్యే అవకాశాలున్నాయి. ఏప్రిల్, మే మాసాల్లో అకాల వర్షాలు పడుతూనే ఉన్నాయి. దీంతో ఇప్పటికే పొలాలు నీరు తాగి ఉన్నాయి. ఎక్కడ చూసినా పచ్చని ఆహ్లాదకర వాతావరణం కనిపిస్తుంది. పటమట వేడిగాలుల సెగ ఈ ఏడాదికి ఇక లేనట్టేనంటున్నారు. మొత్తానికి తొలకరి పలుకరింపుతో ఎన్టీఆర్ జిల్లాలోని మైలవరం లాంటి మెట్ట ప్రాంతాల్లో ఇప్పటికే పత్తి సాగుకు పొలాలను సిద్ధం చేసి ఉంచారు అన్నదాతలు. భూముల్లో పదునుండటంతో పత్తిని నేరుగా నాటేందుకు రైతులు విత్తనాలు కొనుగోలు చేసి పెట్టుకున్నారు. జి.కొండూరు మండలం వెంకటాపురం, చెవుటూరు గ్రామాల్లో కొందరు రైతులు పత్తి విత్తనాలు నాటారు. వర్షాలు కాస్త తెరిపిచ్చి భూములు ఆరితే అచ్చులు తోలి పత్తి విత్తనాలు నాటేందుకు సిద్ధంగా ఉన్నారు.

నాలుగు దశాబ్దాల తర్వాత

సుమారు 4 దశాబ్దాల క్రితం రోహిణి కార్తెలో విస్తారంగా వర్షాలు కురిసి వాతావరణం చల్లబడింది. మళ్లీ ఇప్పుడు రోహిణి కార్తె ప్రారంభానికి ముందే వాతావరణం చల్లబడింది. ఇది శుభ పరిణామమే అంటున్నారు రైతులు.

మాగాణి సాగుకు అనుకూలం

ఇప్పుడు పడుతున్న వర్షాలు మాగాణి సాగుకు అనుకూలమంటున్నారు అన్నదాతలు. ఇప్పటికే కాలువలు, సప్లై చానెల్స్, భూములు నీరు తాగి ఉన్నాయి. ఇకపై పడే వర్షాలు నేరుగా భూమిపై పారి వాగులు కదిలి చెరువులు నిండేందుకు దోహదం చేస్తాయంటున్నారు.

ఎరువులు, విత్తనాలు సిద్ధం

ఖరీఫ్‌లో రైతులు విత్తనాలకు, ఎరువులకు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా అధికారులు చర్యలు తీసుకున్నారు. అవసరాన్ని బట్టి విత్తనాలను ఇప్పటికే స్టాక్ పెట్టించారు. భూసారాన్ని పెంచే పచ్చిరొట్ట విత్తనాలైన జీలుగ, పిల్లి పెసర, పెసర విత్తనాలు 50 శాతం సబ్సిడీపై రైతులకు పంపిణీ చేసేందుకు ఏవో కార్యాలయాలకు రప్పించి ఉంచారు. కొన్నిచోట్ల సబ్సిడీపై రైతులకు పంపిణీ చేస్తున్నారు.

ఎన్టీఆర్ జిల్లాలో సాగయ్యే పంటల వివరాలు		
వరి	:	48,167 హెక్టార్లు
మొక్కజొన్న	:	3,668 హెక్టార్లు
పెసర	:	3,622 హెక్టార్లు
మినుము	:	2,250 హెక్టార్లు
చెరకు	:	438 హెక్టార్లు
పత్తి	:	36,254 హెక్టార్లు
కృష్ణా జిల్లాలో..		
వరి	:	1.62 లక్షల హెక్టార్లు
చెరకు	:	3 వేల హెక్టార్లు
మినుము	:	1,300 హెక్టార్లు
పత్తి	:	300 హెక్టార్లు
మొక్కజొన్న	:	100



ముందస్తు తొలకరి మంచిదే
వేములకొండ వేణు గోపాలరావు



ముందస్తుగా తొలకరి రావడం మంచిదే. అదును, పదును బట్టి వ్యవసాయం సాగుతుంది. ఈఏడాది అదును, పదును బా గానే ఉండేలా ఉంది. వర్షాలతో పొలాలు నీరు తాగేసి ఉన్నాయి. పంటల సాగుకు అనుకూలంగా ఉంది. సకాలంలో సాగు చేస్తే దిగుబడులు బాగుంటాయి.

రైతులకు ఎంతో మేలు: ఏడీఏ కే శశికళ



ఖరీఫ్ 18 రోజులు మందుగానే ప్రారంభమయ్యే అవకాశం ఉంది. సకాలంలో పంటల సాగుతో చీడపీడల దాడి తగ్గుతుంది. ఎరువులు, మందులు సకాలంలో వాడుకునే అవకాశం ఉంది. నవంబరు నెలాఖరు కల్లా పంటలు చేతికి వస్తుంది. డిసెంబరులో వచ్చే చెడువానల నుంచి పంటను కాపాడుకునే అవకాశం ఉంది.



అంబాపురంలో సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే యార్లగడ

గ్రామాల్లో రోడ్ల అభివృద్ధికి ప్రాధాన్యం

- ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యార్లగడ్డ
- రూ.95.24 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లు ప్రారంభం

విజయవాడ రూరల్ మే 31 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని గ్రామాల్లో రోడ్ల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నామని, మారుమూల ప్రాంతాల్లో సైతం రోడ్లు అభివృద్ధి చేసి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూస్తామని ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో పూర్తి చేసుకున్న సీసీ రోడ్లను శనివారం ఆయన ప్రారంభించారు. తొలుత పీ నైనవరం గ్రామంలోని ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించిన అనంతరం మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం, మండల పరిషత్ నిధులతో విజయవాడ రూరల్ మండలం అంబాపురంలో రూ.50లక్షలతో సీసీ రోడ్డు, పీ నైనవరం గ్రామ పరిధిలో రూ.25 లక్షలు, రూ.20.25లక్షలతో నిర్మించిన రెండు సీసీ రోడ్లను ప్రారంభించారు. ఇప్పటికే పలుచోట్ల రోడ్ల నిర్మాణాలు పూర్తి చేశామని, సాధ్యమైనంత త్వరలో ప్రతి రోడ్డును అభివృద్ధి చేసి ప్రజలకు అందుబాటులోకి తెస్తామన్నారు. భారీ వర్షాల నేపథ్యంలో రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. టీడీపీ రూరల్ మండలాధ్యక్షుడు గొడ్డల్ల చిన రామారావు, గ్రామ సర్పంచులు గండికోట సీతయ్య, బట్టా సోమయ్య, టీడీపీ నేతలు రామకృష్ణ, దేవేంద్ర పాల్గొన్నారు.

రేపటి నుంచి విద్యార్థులకు బస్‌పాస్‌లు

బస్టేషన్, మే 31 (ఆంధ్రజ్యోతి): వేసవి సెలవులు అనంతరం విద్యాసంస్థలు పునః ప్రారంభం కానున్నందున విద్యార్థులకు బస్ పాస్‌ల జారీకి ఏపీఎస్ఆర్టీసీ అన్ని ఏర్పాట్లను సిద్ధం చేసింది. జూన్ 2న సోమవారం నుంచి బస్ పాస్‌ల జారీ ప్రక్రియ ప్రారంభం కానుంది. విజయవాడ సిటీకి సంబంధించి పండిట్ నెహ్రూ బస్టేషన్‌లోని కౌంటర్ల నుంచి తమ పాస్‌లను పొందవచ్చు. ఆటోనగర్, కంకిపాడు, ఇబ్రహీంపట్నం కౌంటర్లలో రెన్యువల్స్ మాత్రమే చేస్తారు. ఎన్టీఆర్ జిల్లాలోని తిరువూరు, జగ్గయ్యపేట బస్టేషన్లలో కొత్త బస్ పాస్‌లు జారీ చేస్తారు. ఉదయం 9 నుంచి రాత్రి 8 గంటల వరకు ఈ కౌంటర్లను తెరచి ఉంచుతారు. ఆదివారాలు మాత్రం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు పాస్‌లు జారీ చేస్తారు. ఆదివారం మినహా ప్రతిరోజూ ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు బస్‌పాస్ దరఖాస్తులను పరిశీలిస్తారు. 12ఏళ్లలోపు బాలురకు (7వ తరగతి), 18 ఏళ్లలోపు బాలికలకు (10వ తరగతి వరకు) ఉచిత బస్సు పాస్‌లను జారీ చేస్తారు. విద్యార్థులు దరఖాస్తు ఫారాన్ని పూర్తి చేసి ఫొటో అంటించి, బోనఫైడ్ సర్టిఫికెట్‌లో ప్రిన్సిపాల్ గానీ, హెడ్ మాస్టర్ గానీ సంతకం చేయాల్సి ఉంటుంది. ఈ ఫారాలను డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఏపీఎస్ఆర్టీసీపాస్.ఇన్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాల్సి ఉంటుంది. ఆన్‌లైన్‌లో దరఖాస్తులు పూర్తిచేసి ఫొటోపై బోనఫైడ్ సర్టిఫికెట్ నందు ప్రిన్సిపాల్, హెడ్‌మాస్టర్‌తో సంతకం చేయాల్సి ఉంటుంది. విద్యార్థుల జాబితాలు అందిన ఆరువాతే కొత్త బస్ పాస్‌లు జారీ చేస్తారు. విద్యార్థులు ఇబ్బంది పడకుండా కళాశాల యాజమాన్యాలు ముందస్తు చర్యలు తీసుకొని జాబితాలు పంపాల్సిందిగా ఆర్టీసీ అధికారులు విజ్ఞప్తి చేస్తున్నారు. బస్ పాస్‌ల జారీకి ఏర్పాట్లు సిద్ధం చేశామని జిల్లా ప్రజా రవాణ అధికారి ఎం.వై.దానం తెలిపారు.

జడ్పీ ఉద్యోగులకు బదిలీలు రేపు

మచిలీపట్నం, మే 31 (ఆంధ్రజ్యోతి): ఈనెల 2న ఉదయం 10 గంటలకు జిల్లా పరిషత్ పరిధిలో పనిచేస్తున్న అధికారులు, సిబ్బందికి సంబంధించిన బదిలీలు జిల్లా పరిషత్ సమావేశపు హాలులో నిర్వహించనున్నట్టు జడ్పీ సీఈవో కన్నమనాయుడు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీడీవోలు, సీనియర్, జూనియర్ అసిస్టెంట్‌లు, టైపిస్టులు, వివిధస్థాయిల్లో ఉద్యోగులకు ప్రభుత్వ ఆదేశాలతో కౌన్సెలింగ్ పద్ధతిలో బదిలీలు చేయడం జరుగుతుందని ఆయన తెలిపారు.

యోగా సాధనతో సంపూర్ణ ఆరోగ్యం



మంగినపూడి బీచ్ వద్ద యోగాంధ్రలో పాల్గొన్న వివిధ శాఖల ఉద్యోగులు, మహిళలు

- మంగినపూడి బీచ్‌లో వెయ్యి మందితో యోగాంధ్ర
- హాజరైన మంత్రి కొల్లు, కలెక్టర్ బాలాజీ, జేసీ గీతాంజలిశర్మ, ఎస్పీ గంగాధర్, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల, డీసీఎంఎస్ చైర్మన్ రామకృష్ణ

మచిలీపట్నం టౌన్, మే 31 (ఆంధ్రజ్యోతి): యోగ సాధనతో సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చని, జూన్ 21న నిర్వహించే అంతర్జాతీయ యోగ దినోత్సవం విజయవంతం చేయాలని రాష్ట్ర గనులు, భూగర్భవనరులు, ఎక్సైజ్‌శాఖ మంత్రి కొల్లు రవీంద్ర పిలుపునిచ్చారు. యోగాంధ్రలో భాగంగా శనివారం మంగినపూడి బీచ్‌లో వెయ్యి మందితో పెద్ద ఎత్తున యోగ ప్రదర్శన నిర్వహించారు. యోగసాధకులు వైవోజీఏ ఆకృతిలో యోగా చేయడం ఒక మెగా ఈవెంట్‌గా మిగిలిపోయింది. మంత్రి కొల్లు రవీంద్రతో పాటు ఏపీఎస్ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు, కలెక్టర్ డీకే బాలాజీ, జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మ, జిల్లా ఎస్పీ ఆర్ గంగాధరరావు, డీసీఎంఎస్ చైర్మన్ బండి రామకృష్ణ పాల్గొని యోగ సాధకులకు స్ఫూర్తి నిచ్చారు. ఆకుపచ్చని తివాసిపై యోగ అనే అక్షరాకృతిలో యోగసాధకులు కూర్చుని ప్రాణాయామం, ఆసనాలు, ధ్యానం నిర్వహించడం విశేషం. యోగ శిక్షకురాలు శిరీష తన దైన శైలిలో అందరితో యోగాసనాలు వేయించారు. మరో యోగశిక్షకుడు పోతన శాస్త్రి సూచనలు ఇస్తూ ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ జూన్ 21న విశాఖ బీచ్‌లో 5లక్షల మందితో నిర్వహించనున్న యోగాంధ్రలో ప్రధాని మోదీ పాల్గొంటారన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 2కోట్ల మందితో యోగ చేయించాలనే లక్ష్యంతో అందరూ పనిచేయాలన్నారు. ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు మాట్లాడుతూ ప్రతిరోజూ తాను యోగ చేస్తున్నానన్నారు. కలెక్టర్ డీకే బాలాజీ మాట్లాడుతూ గత ఏడాది అంతర్జాతీయ యోగ దినోత్సవం నుంచి ప్రతిరోజూ క్రమం తప్పకుండా యోగ చేస్తున్నానని కలెక్టర్ తెలిపారు. శిక్షకురాలు శిరీష చూపిన వీడియోను అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. ఎస్పీ ఆర్ గంగాధరరావు మాట్లాడుతూ ప్రజలందరూ యోగాపట్ల మక్కువ పెంచుకోవాలన్నారు. బందరు ఆర్డీవో స్వాతి, మునిసిపల్ కమిషనర్ బాపిరాజు, విజిలెన్సు డిప్యూటీ కలెక్టర్ పోతిరాజు, డీఆర్వో చంద్రశేఖర్, జడ్పీ సీఈవో కన్నమనాయుడు, ఏఎస్పీలు సత్యనారాయణ, పీవీ నాయుడు, బందరు డీఎస్పీ సీహెచ్ రాజు, మార్కెట్‌యార్డు చైర్మన్ కుంచే నాని, మునిసిపల్ మాజీ చైర్మన్ మోటమర్రి బాబా ప్రసాద్, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గొర్రెపాటి గోపీచంద్, మాజీ ఎంపీపీ కాగిత వెంకటేశ్వరరావు, ఆయుష్ ప్రతినిధులు భాగ్యలక్ష్మి, ఇంద్రాణి, జిల్లా స్పోర్ట్స్ అధికారి ఝాన్సీలక్ష్మి, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, డ్వాక్రా మహిళలు, ఆంధ్రప్రదేశ్ యోగసభ సభ్యులు పాల్గొన్నారు. శిరీష తన యోగాసనాలతో ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేసింది.

64 లక్షల పింఛన్లు ఇస్తున్న ఘనత కూటమి ప్రభుత్వానిదే

దేశంలో ఎక్కడా లేని విధంగా ఆంధ్రప్రదేశ్‌లో 64 లక్షల పింఛన్లు అందజేస్తూ పేదలను ఆదుకుంటున్నామని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. శనివారం బందరు మండలం తాళ్లపాలెంలోని స్నేహాలయం వృద్ధాశ్రమం, చిలకలపూడిలో కలెక్టర్ బాలాజీ, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావుతో కలిసి మంత్రి కొల్లు రవీంద్ర సామాజిక పింఛన్లు అందజేశారు. తాళ్లపాలెంలో దివ్యాంగులు వేదాంతం రాజేంద్ర స్వామి, నత్తదేవ సహాయానికి రూ.6వేలు, మచిలీపట్నం 7వ డివిజన్‌లో హరికృష్ణబాబుకు రూ.10వేలు, అర్జా రుత్వికకు రూ.6వేలు, మంచానికి పరిమితమైన అప్పలరాజుకు రూ.15వేలు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతినెలా రూ.2700 కోట్ల పింఛన్లు అందచేస్తోందన్నారు. జిల్లాలో కొత్తగా 2800 పింఛన్లు మంజూరయ్యాయన్నారు. ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు మాట్లాడుతూ ఆగస్టు 15 నుంచి ఉచిత బస్సు ప్రయాణం ఏర్పాటు చేస్తామన్నారు. అనంతరం మంగినపూడి బీచ్‌లో జరగనున్న మసులా బీచ్ ఫెస్టివల్ సందర్భంగా 100 అడుగుల జాతీయ పతాక స్తంభానికి పునాదిని పరిశీలించారు. ఎస్పీ గంగాధరరావు, మెప్మా పీడీ సాయిబాబు, డీఆర్‌డీఏ పీడీ హరిహరనాథ్, కమిషనర్ బాపిరాజు, తహసీల్దార్ హరనాథ్, గొర్రెపాటి గోపీచంద్, బండి రామకృష్ణ, కుంచే నాని, మోటమర్రి బాబాప్రసాద్ పాల్గొన్నారు.



బీచ్ ఫెస్టివల్‌పై సమీక్ష సమావేశం నిర్వహించిన మంత్రి రవీంద్ర

పోర్టు, పరిశ్రమలు, పర్యాటకాభివృద్ధే లక్ష్యం

- మంత్రి కొల్లు రవీంద్ర

మచిలీపట్నం టౌన్, మే 31 (ఆంధ్రజ్యోతి): మచిలీపట్నం అభివృద్ధిలో భాగంగా బందరు పోర్టు, పరిశ్రమలు, పర్యాటక రంగ అభివృద్ధే ప్రధాన లక్ష్యంగా పనిచేస్తున్నామని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో కలెక్టర్ డీకే బాలాజీతో కలిసి మచిలీపట్నం బీచ్ ఫెస్టివల్ ఏర్పాట్లపై మంత్రి సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఎంతో ప్రాచీన చరిత్ర గల మచిలీపట్నాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసేందుకు కూటమి ప్రభుత్వం లక్ష్యంగా నిర్ణయించిందన్నారు. మంగినపూడి బీచ్‌ను పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. జూన్ 5,6,7,8 తేదీల్లో మసూలా బీచ్ ఫెస్టివల్ నిర్వహిస్తున్నామన్నారు. గోవా షిపింగ్ యార్డు వారు మచిలీపట్నంలో పోర్టు ఆధారిత కార్యక్రమాల నిర్వహణకు ముందుకు రాగా ఎంవోయూ కుదుర్చుకుంటున్నామన్నారు. కలెక్టర్ బాలాజీ మాట్లాడుతూ మసూలా బీచ్ ఫెస్టివల్‌లో క్రీడలు, సాంస్కృతిక ప్రదర్శనలతో పాటు హెలీరైడ్, వంటి వినోద కార్యక్రమాలు జరుపుతామన్నారు. గజ ఈతగాళ్లు, ఎన్డీఆర్ఎఫ్, ఎస్టీఆర్ఎఫ్ బృందాలను తప్పనిసరిగా ఏర్పాటు చేయాలన్నారు. డీఆర్వో చంద్రశేఖర్, జడ్పీ సీఈవో కన్నమ నాయుడు, డిప్యూటీ సీఈవో ఆనందకుమార్, ఆర్డీవో కే స్వాతి, ఆర్ట్ డైరెక్టర్ వంకా రమణ, ఆర్‌అండ్‌బీ ఈఈ లోకేష్, సోషల్ వెల్ఫేర్ డీడీ సాహెద్‌బాబు, ఆర్టీసీ డీఎం పెద్దిరాజు, తహసీల్దార్ హరనాథ్ పాల్గొన్నారు.

నేటినుంచి రేషన్‌షాపుల్లో సరుకుల పంపిణీ: జేసీ

మచిలీపట్నం, మే 31 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అన్ని రేషన్‌షాపుల్లో నేటి నుంచి బియ్యం కార్డులున్నవారికి నిత్యావసరాల పంపిణీకి ఏర్పాట్లు చేసినట్టు జేసీ గీతాంజలిశర్మ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని 1,059 రేషన్‌షాపుల్లో నేటి ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 వరకు, సాయంత్రం 4 నుంచి రాత్రి 8 గంటల వరకు సరుకులు తీసుకువెళ్లవచ్చన్నారు. కార్డుదారులు ఏ రేషన్‌షాపు నుంచైనా సరుకులు తీసుకెళ్లవచ్చన్నారు. పంపిణీలో ఇబ్బందులు రాకుండా రెవెన్యూ, పౌరసరఫరాలశాఖ, తూనికలు, కొలతల విభాగం అధికారులు తనిఖీలు చేశారన్నారు. ఈ-పోస్ మిషన్లను సిద్ధంగా ఉంచామన్నారు. జిల్లాలో 7,200 టన్నుల బియ్యం, 200 టన్నుల పంచదారను రేషన్‌షాపుల వద్ద సిద్ధంగా ఉంచామన్నారు. ప్రతినెలా 1 నుంచి 15లోగా బియ్యం, పంచదారను కార్డుదారులు తీసుకోవచ్చన్నారు.

మామ్మా.. ఆరోగ్యం ఎలా ఉంది?

కలెక్టరేట్, మే 31 (ఆంధ్రజ్యోతి): 'మామ్మా.. ఆరోగ్యం ఎలా ఉంది? పెన్షన్ నెల నెలా సక్రమంగా అందుతోందా, ఇబ్బందులేమైనా ఉన్నాయా? అంటూ రాష్ట్ర భూ పరిపాలన ప్రధాన కమిషనర్ (సీసీఎల్ఏ), జిల్లా ప్రత్యేక అధికారి జి.జయలక్ష్మి, కలెక్టర్ లక్ష్మీశ పెన్షన్‌దారులను కుశల ప్రశ్నలడిగి శనివారం పెన్షన్లు పంపిణీ చేశారు. ప్రత్యేక ప్రణాళికతో పీ-4 వంటి వినూత్న విధానాలను ప్రభుత్వం అమలుచేస్తున్నట్టు తెలిపారు. పెన్షన్ల పంపిణీలో భాగంగా జయలక్ష్మి, కలెక్టర్ లక్ష్మీశ, ఇతర అధికారులతో కలిసి అర్బన్ పరిధిలోని బృందావన్ కాలనీలో పెన్షన్‌ల పంపిణీలో పాల్గొన్నారు. వార్డు సచివాలయ కార్యదర్శులు, ప్రభుత్వ ఉద్యోగుల ద్వారా ఇంటింటికీ వెళ్లి పెన్షన్లు అందిస్తున్న ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా జి.జయలక్ష్మి మాట్లాడుతూ జూన్ 1న ఆదివారం కావడంతో ఒకరోజు ముందుగానే మే 31న శనివారమే పెన్షన్లు అందిస్తున్నామని, ఎలాంటి అవకతవకలకు ఆస్కారం లేకుండా పారదర్శకంగా, జవాబుదారీతనంతో ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా పెన్షన్లను లబ్ధిదారుల ఇళ్ల వద్దే అందిస్తున్నట్టు తెలిపారు.

పెన్షన్ దారులకు అధికారుల పలకరింపు



పెన్షన్ ఇస్తున్న సీసీఎల్ఏ అధికారి జయలక్ష్మి

పెన్షన్ల పంపిణీపై నిరంతర పర్యవేక్షణ

ఎన్టీఆర్ జిల్లాలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల కింద 2,27,786 పెన్షన్లకు దాదాపు రూ.98.11 కోట్లు పంపిణీ జరుగుతోందని, కలెక్టర్ అన్నారు. వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్రతో కలిసి ఆయన శనివారం విజయవాడ అర్బన్, సత్యనారాయణపురంలో పెన్షన్ల పంపిణీలో పాల్గొన్నారు. లబ్ధిదారులను కుశల ప్రశ్నలడిగి వారి అభిప్రాయాలు తెలుసుకుని పెన్షన్లను పంపిణీ చేశారు. డీఆర్‌డీఏ పీడీ ఏఎన్‌వీ నాంచారరావు, యూసీడీ పీవో పి.వెంకట నారాయణ, స్థానిక ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ పరీక్ష రేపటి నుంచి

- పరీక్షకు హాజరుకానున్న 660 మంది అభ్యర్థులు
- నలందా విద్యా నికేతన్‌లో పరీక్షా కేంద్రం ఏర్పాటు: డీఆర్వో నరసింహం

కలెక్టరేట్, మే 31 (ఆంధ్రజ్యోతి): ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ల పరీక్ష నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేసి సిద్ధం చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి ఎం.లక్ష్మీ నరసింహ అధికారులను ఆదేశించారు. ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ మెయిన్స్ పరీక్ష నిర్వహణకు చేపట్టాల్సిన ఏర్పాట్లపై శనివారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్సు హాలులో డీఆర్వో నరసింహ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్వో మాట్లాడుతూ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ల పరీక్షను జూన్ 2 నుంచి 4 వరకు ఆఫ్‌లైన్ ఓఎంఆర్ ఆధారిత పరీక్షలు జరుగుతుందన్నారు. నగరంలోని నలంద విద్యా నికేతన్ కళాశాలలో పరీక్ష కేంద్రాన్ని ఏర్పాటు చేశామన్నారు. 660 మంది అభ్యర్థులు హాజరు కానున్నారన్నారు. జూన్ 2న క్వాలిఫైయింగ్ టెస్ట్ జనరల్ ఇంగ్లీష్, జనరల్ తెలుగు పరీక్ష మధ్యాహ్నం 2.30 నుంచి 4.10 గంటల వరకు, 3న ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జనరల్ స్టడీస్, మెంటల్ ఎబిలిటీ (పేపర్-1), మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు మ్యాథమెటిక్స్ (పేపర్-2) పరీక్ష, 4న జనరల్ ఫారెస్ట్రీ-1 (పేపర్-3), ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు, జనరల్ ఫారెస్ట్రీ-2 (పేపర్-4) మధ్యాహ్నం 2.30 నుంచి 5 గంటల వరకు రెండు షిఫ్టుల్లో జరుగుతాయన్నారు. అభ్యర్థులు హాల్‌టిక్కెట్‌తో పాటు గుర్తింపు కార్డు తీసుకురావాల్సి ఉంటుందన్నారు. అభ్యర్థులకు ఇబ్బందులు కలగకుండా అన్ని ముందస్తు ఏర్పాట్లు చేసి పరీక్షా కేంద్రాన్ని సిద్ధంగా ఉంచాలని డీఆర్వో ఎం.లక్ష్మీ నరసింహ అధికారులను ఆదేశించారు. ఏపీపీఎస్సీ అసిస్టెంట్ సెక్రటరీ టి.ఎస్.ఆర్.రాజగోపాల్, కో-ఆర్డినేషన్ సెక్షన్ సూపరింటెండెంట్ ఎస్.సలీం, లైజన్ ఆఫీసర్ పి.వైకుంఠ రావు, నలంద విద్యానికేతన్ చీఫ్ సూపరింటెండెంట్ డి.రజని పాల్గొన్నారు.

జిల్లాను పొగాకు రహితంగా తీర్చిదిద్దుదాం: కలెక్టర్

కలెక్టరేట్, మే 31 (ఆంధ్రజ్యోతి): ఊపిరితిత్తులు, కేన్సర్ వ్యాధులకు కారణమైన పొగాకు, గుట్కా, ఖైనీ వంటి మత్తుపదార్థాల నుంచి ఆరోగ్యాన్ని రక్షించుకొనేలా ప్రతి ఒక్కరినీ చైతన్యవంతుల్ని చేసి పొగాకు రహిత జిల్లాగా తీర్చిదిద్దాలని కలెక్టర్ లక్ష్మీశ పిలుపునిచ్చారు. ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా శనివారం కలెక్టరేట్ ప్రాంగణంలో వైద్యారోగ్య కుటుంబ సంక్షేమ శాఖ, స్వచ్ఛంద సంస్థల సహకారంతో పొగాకు వల్ల కలిగే నష్టాలపై ముద్రించిన అవగాహన పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ పొగాకు వినియోగంతో మన శరీరంలోని అన్ని అవయవాలకు నష్టం జరుగుతుందన్నారు. నెలరోజుల పాటు నిర్వహిస్తున్న యోగాంధ్ర క్యాంపెయిన్ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు స్వర్ణాంధ్ర 2047 విజన్ లక్ష్యం సాధనలో భాగంగా ఆరోగ్యకర సమాజన నిర్మాణంలో భాగస్వాములు కావాలన్నారు. విద్యాసంస్థల సమీపంలో పొగాకు ఉత్పత్తుల విక్రయాలు జరపకూడదనే నిబంధనను జిల్లావ్యాప్తంగా అమలు చేస్తున్నట్లు తెలిపారు. పొగాకు ఉత్పత్తుల అలవాటు పడిన వారు మానుకొనేందుకు జిల్లా ఆసుపత్రిలోని డీ అడిక్షన్ కేంద్రాల ద్వారా కౌన్సెలింగ్ నిర్వహించడం జరుగుతుందన్నారు. కోట్పా యాక్ట్‌లో జిల్లాలో కట్టుదిట్టంగా అమలుచేసేలా ప్రత్యేకచర్యలు తీసుకొంటున్నామన్నారు. అనంతరం నేను సైతం ఎన్టీఆర్ జిల్లాను పొగాకు రహిత జిల్లాగా మారుస్తానని, సిగ్నేచర్ క్యాంపెయిన్‌లో సంతకం చేసి సంచార అవగాహన వాహనాన్ని ప్రారంభించారు. జిల్లా రెవెన్యూ అధికారి ఎం.లక్ష్మీ నరసింహం, డీఎంహెచ్‌వో డాక్టర్ ఎం.సుహాసిని, ఫోరం ఫర్ చైల్డ్ రైట్స్ జిల్లా కో-ఆర్డినేటర్ అరవ రమేష్, నవజీవన్ బాలభవన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఫాదర్ తంబి, ప్రోగ్రాం మేనేజర్ శేఖర్, కో-ఆర్డినేటర్ జాకబ్ రాజు పాల్గొన్నారు.



కలెక్టరేట్‌లో పొగాకు వల్ల కలిగే నష్టాలపై ముద్రించిన పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్

ఈ-శ్రమ్ పోర్టల్‌లో వివరాలు నమోదు చేసుకోండి

సంఘటిత, అసంఘటిత రంగాల్లో పనిచేస్తున్న కార్మికులు ఈ-శ్రమ్ పోర్టల్‌లో నమోదు చేసుకోవాలని కలెక్టర్ లక్ష్మీశ కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఆవిష్కరించిన స్వర్ణాంధ్ర-2047 దార్శనిక ప్రణాళికకు అనుగుణంగా దశల వారీగా లక్ష్యాలను చేరుకొనేలా జిల్లాస్థాయిలో కలెక్టరేట్ ప్రాంగణంలో శనివారం ఇగ్నైట్ ప్రత్యేక సెల్‌లో ఏర్పాటు చేసిన కార్మిక శాఖ స్టాల్‌ను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఒక కుటుంబం - ఒక పారిశ్రామికవేత్త సాకారం దిశగా ఔత్సాహికులను సరికొత్త ఆలోచనలతో పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేందుకు ఈ సెల్ అవసరమైన సహాయ సహకారాలు అందిస్తుందని, కేంద్ర రాష్ట్ర కార్మిక శాఖలు, సంఘటిత, అసంఘటిత రంగాల్లోని కార్మికులతో పాటు ఓలా, బ్లింకిట్, స్విగ్గీ, జొమాటో వంటి ఆన్‌లైన్ ప్లాట్ ఫాం కార్మికులు, గిగ్ కార్మికులు ఈ-శ్రమ్ పోర్టల్‌లో నమోదు చేసుకోవాలన్నారు. వీరికి సామాజిక భద్రతతో పాటు ప్రభుత్వ పథకాలను చేరువ చేసేందుకు కేంద్రం ఈ పోర్టల్‌ను ప్రారంభించిందన్నారు. ఈ-శ్రమ్ పోర్టల్ నమోదులో ఎదురయ్యే ఇబ్బందులను పరిష్కరించేందుకు జిల్లా కార్మిక శాఖ చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. ఈ సందర్భంగా ఈ-శ్రమ్ పోర్టల్‌లో నమోదు చేసుకొన్న ఎం.పావనికి యూనిక్ ఐడీ కార్డును కలెక్టర్ అందజేశారు. స్టాల్స్ పరిశీలనలో డీఆర్వో ఎం.లక్ష్మీ నరసింహం, ఉప కార్మిక కమిషనర్ సీహెచ్ ఆశారాణి, అసిస్టెంట్ కమిషనర్ మహేష్, అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్లు ఉన్నారు.

యోగాను జీవితంలో భాగం చేసుకోవాలి.

సత్యనారాయణపురం: అన్నదాతలు ఆరోగ్య సిరుల పంటను పొందేందుకు యోగా ధ్యానసాధనను జీవితంలో భాగం చేసుకోవాలని వ్యవసాయ శాఖ డైరెక్టర్ ఎస్.ఢిల్లీరావు, కలెక్టర్ జి.లక్ష్మీశ అన్నారు. ఆయుష్ శాఖ, ఎన్టీఆర్ జిల్లా అధికారులు, వీఎంసీ ఆధ్వర్యంలో శనివారం బీఆర్‌టీఎస్ యోగా వీధిలో నిర్వహించిన రైతన్నల థీమ్ యోగాలో వారు పాల్గొని రైతులతో కలిసి యోగాసనాలు అభ్యసించారు. ఢిల్లీరావు మాట్లాడుతూ రైతన్నలు యోగా, ధ్యానంతో శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఆరోగ్యం పొందవచ్చునన్నారు. కలెక్టర్ జి.లక్ష్మీశ మాట్లాడుతూ భారతీయ సంస్కృతి ప్రపంచానికి ఇచ్చిన అమూల్యమైన బహుమతి యోగా అన్నారు. యోగాను నేర్చుకొని జీవితాంతం ఆచరించాలన్నారు. డీఎంహెచ్‌వో ఎం.సుహాసిని, జిల్లా ఆయుష్ యోగాంధ్ర నోడల్ అధికారి డాక్టర్ వి.రాణి, డాక్టర్ రామతేల్లిహి, జిల్లా వ్యవసాయ అధికారి డీఎంఎఫ్ విజయకుమారి, వివిధశాఖ అధికారులు పాల్గొన్నారు.



యోగాసనాలు వేస్తున్న ఢిల్లీరావు, లక్ష్మీశ, ధ్యానచంద్ర

బ్రాయిలర్ ధరలు



అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్‌బర్డ్	122, 131, 142
చికెన్ విత్ స్కిన్	234
చికెన్ స్కిన్‌లెస్	244

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 510

నూతన దుస్తుల పంపిణీ

గుడివాడ, మే 31 (ఆంధ్రజ్యోతి) : స్థానిక వెలమ సంక్షేమ సంఘం భవన్‌లో గుడివాడ వెలమ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సంబంగి కనకసుం దరరావు జ్ఞాపకార్థం వారి కుమారుడు సుధాకర్ సహకారంతో శనివారం టూ టౌన్ సీఐ చల్లా నాగప్రసాద్ చేతుల మీదగా 33 మంది పేద సంఘీయులకు నూతన దుస్తులు అందజేశారు. సంఘ నాయకులు సత్యానారాయణ, ఆనంద్, ప్రభాకరరావు, ఉమా తదితరులు పాల్గొన్నారు.



దుస్తులు అందజేస్తున్న టూటౌన్ సీఐ నాగప్రసాద్

సైడ్ డ్రెయిన్లు అధ్వానం!

- మట్టితోలి పూడ్చివేసిన వైనం
- పూడికతీయాలని ప్రజల వేడుకోలు

(ఆంధ్రజ్యోతి - నందివాడ)

వేసవికాలం అయిపోయి వర్షాకాలం వస్తున్నా గ్రామాల్లో సైడ్ డ్రెయిన్ల పూడికతీత చేపట్టకపోవడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వెన్ననపూడి, కుదరవల్లి, తమిరిశ, పోలుకొండ, లక్ష్మీనరసింహపురం గ్రామాల్లో సైడ్ డ్రెయిన్ పూడిపోయి మురుగు రోడ్డెక్కి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్లపై నడవటానికి కూడా వీలు లేని పరిస్థితి ఉందని ఆయా గ్రామాల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. వర్షాకాలంలో పరిస్థితి ఏ విధంగా ఉంటుందో అర్థం చేసుకోవాలన్నారు. కొంతమంది ప్రజలు ట్రాక్టర్లతో మట్టి తోలించుకుని సైడ్ డ్రెయిన్లు పూడ్చివేసిన దాఖలాలు ఉన్నా పంచాయతీ అధికారులు పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చొరవ చూపి గ్రామాల్లో సైడ్ డ్రెయిన్లు పూడిక తీసి రోడ్లపై మురుగు సమస్యను పరిష్కరించాల్సిందిగా ప్రజలు కోరుతున్నారు. ఈ విషయమై ఈవోపీఆర్డీ అమీర్ మీర్జా బాషా మాట్లాడుతూ పంచాయతీల ద్వారా సైడ్ డ్రెయిన్లు పూడికతీయించే విధంగా చర్యలు చేపడతామన్నారు.



వెన్ననపూడిలో సైడ్ డ్రెయిన్‌లో మట్టి గుట్టలు

రోడ్డు ప్రమాదంలో డ్రైవర్ మృతి

గుడివాడ రూరల్, మే 31 (ఆంధ్రజ్యోతి): గుడివాడ రూరల్ మండలం వలివర్తిపాడు పరిధిలో ఉన్న బైపాస్ రోడ్డులో ద్విచక్ర వాహనదారుడైన చిన్న పెద్దిరాజులు (39) అదుపు తప్పి కింద పడిపోగా, శుక్రవారం అర్ధరాత్రి మరణించినట్లు ఏఎస్ఐ దేవనబోయిన కృష్ణారావు శనివారం తెలిపారు. ఇతను ముదినేపల్లి మండలం పెనుమల్లి గ్రామానికి చెందిన చిన్న పెద్దిరాజులు తాత్కాలికంగా ట్యాక్సీ తోలుతున్నాడు. శుక్రవారం అమ్మ అపార్ట్‌మెంట్‌లో కిరాయికి కుదుర్చుకుని తాత్కాలికంగా టాక్సీ కిరాయికి తిప్పాడు. మళ్లీ ద్విచక్ర వాహనంపై తిరిగి ముదినేపల్లికి రాత్రి వెళ్తుండగా, వాహనం అదుపు తప్పి కిందపడిపోయాడు. మృతునికి భార్య, ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ తెలిపారు.

ప్రభుత్వ లోపాలను ఉపాధ్యాయులపై నెట్టొద్దు

● ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సమరం

గుడివాడ, మే 31 (ఆంధ్రజ్యోతి) : పదవ తరగతి పరీక్షల మూల్యాంకనంలో రాష్ట్ర ప్రభుత్వం ఆర్భాటాలకు పోయి విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతూ, ఉపాధ్యాయులను బాధ్యులను చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎస్.సమరం తెలిపారు. శనివారం స్థానిక ఎస్ఎఫ్ఐ కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడుతూ, విద్యాసంస్కరణల పేరుతో చరిత్రలో ఎన్నడూ లేని విధంగా 7రోజుల్లో పదవ తరగతి పరీక్షా ఫలితాలనిచ్చారని విద్యాశాఖ మంత్రి లోకేష్ ఆర్భాటంగా ప్రకటించారన్నారు. ఎవరి ప్రయోజనాల కోసం ఇతం హడా వుడిగా ఫలితాలను ఇవ్వాల్సి వచ్చిందని మంత్రిని ప్రశ్నించారు. ప్రభుత్వం చేసిన లోపాలతో విద్యార్థులు తీవ్రంగా నష్టపోయారన్నారు. తక్షణమే ప్రభుత్వం ఈ చర్యలు నిలుపుదల చేసి బాధిత విద్యార్థులకు న్యాయం చేసి విధంగా ఆలోచన చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల నుంచి వసూలు చేసిన రివాల్యుయేషన్ ఫీజులను వెంటనే విద్యార్థులకు తిరిగి చెల్లించాలని సమరం డిమాండ్ చేశారు.

అరుణాచలానికి ఆర్టీసీ ప్రత్యేక బస్సు 7న

గుడివాడ, మే 31 (ఆంధ్రజ్యోతి) : ఏపీఎస్ ఆర్టీసీ గుడివాడ డిపో నుంచి ఈ నెల 7న అరుణాచలంకు ప్రత్యేకంగా సూపర్ లగ్జరీ బస్సును ఏర్పాటు చేశామని డిపో మేనేజర్ రాజేష్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మూడు రోజుల యాత్రకు ఒక్కరికి రూ.3000/-లు చెల్లించాలని, మరిన్ని వివరాలకు సెల్ నెం. 91771 01904, 73829 03299, 94947 59318లకు సంప్రదించాలని డిపో మేనేజర్ రాజేష్ కోరారు.

రోటరీక్లబ్ ఆఫ్ గుడివాడ ఆధ్వర్యంలో వైద్యశిబిరం నేడు

గుడివాడ, మే 31 (ఆంధ్రజ్యోతి) : స్థానిక కోతిబొమ్మ సెంటర్‌లోని ప్రభావతి గార్డెన్స్‌లో డాక్టర్ తిపిర్నేని లక్ష్మీపెరుమాళ్ళు, ప్రభావతి, చలసాని రాయన్ చౌదరిల జ్ఞాపకార్థం రోటరీ క్లబ్ ఆఫ్ గుడివాడ ఆధ్వర్యంలో డా.పిన్నమనేని సిద్ధార్థ మెడికల్ కళాశాల, ఆసుపత్రుల వైద్యుల పర్యవేక్షణలో ఆదివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు ప్రోగ్రామ్ కన్వీనర్లు డా.సి.సూర్యచంద్రరావు, గుళ్ళపల్లి కిరణ్‌బాబులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిబిరంలో వైద్య పరీక్షలు నిర్వహించి మందులను ఉచితంగా పంపిణీ చేస్తామని వారు తెలిపారు.



హనుమంతపురంలో వరివిత్తనాలు పంపిణీ చేస్తున్న వైస్ ఎంపీపీ మహేశ్

వరి విత్తనాల పంపిణీ

పమిడిముక్కల, మే 31 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం ఏపీసీడ్స్ ద్వారా రైతులకు అందజేస్తున్న వరి విత్తనాల పంపి ణీని వైస్ ఎంపీపీ కె.మహేశ్, మాజీ వైస్ ఎంపీపీ లింగమనేని బాబూరావు శనివారం ప్రారంభించారు. పాత సచివాలయం వద్ద ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో పాల్గొని రైతులకు వరి విత్తనాలు పంపిణీ చేశారు. రాజులపాటి రామాంజనేయ ప్రసాద్, ఎం.శివనాగరాజు, కొల్లూరి రాఘవులు, కె.శ్రీనివాసరావు, పిచ్చేశ్వరరావు, అగ్రికల్చరల్ అసిస్టెంట్ రవితేజ తదితరులు పాల్గొన్నారు.



భద్రిరాజుపాలెంలో రైతుల సదస్సులో మాట్లాడుతున్న ఏవో నాగేశ్వరరావు

విత్తనశుద్ధితో నాణ్యమైన పంటలు


తోట్లవల్లూరు, మే 31 (ఆంధ్రజ్యోతి) : నాణ్యమైన పంటలు పండించేందుకు విత్తనశుద్ధి చేయటం, మట్టి నమూనా పరీక్షల ఆధారంగా ఎరువుల వాడకం అవసరమని జిల్లా వనరుల కేంద్రం డీడీఏ కె జ్యోతి రమణి అన్నారు. భద్రిరాజుపాలెంలో శనివారం వికసిత కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. విత్తన శుద్ధి చేయటం, ప్రకృతి వ్యవసాయం, పచ్చిరొట్ట విత్తనాల సాగు వాటి ఫలితాలను రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వనరుల కేంద్రం ఏవో బి పద్మజ, ఏడీఏ శ్రీనివాసరావు, మండల ఏవో జి నాగేశ్వరరావు, ఉద్యానాధికారి జోసఫ్ చందు, ఘంటసాల కృషి విజ్ఞాన కేంద్రం సైంటిస్ట్ జి కృష్ణవేణి పాల్గొన్నారు.

నేటి నుంచి రేషన్ షాపుల్లో నిత్యావసరాల పంపిణీ

నందివాడ, మే 31 (ఆంధ్రజ్యోతి): నేటి నుంచి దుకాణాల వద్ద నిత్యావసర సరుకుల పంపిణీకి అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్లు తహసీల్దార్ గురుమూర్తిరెడ్డి తెలిపారు. చౌక ధరల దుకాణంలో నిత్యావసర సరుకులు పంపిణీ చేసే సమ యాలు డీలరు పేరు ఫిర్యాదులు చేసే ఫోన్ నెంబర్లు ఇతర వివరాలు బోర్డులపై ఏర్పాటు చేశ్మాన్నారు. కార్డుదారులు వారి షాప్ వద్దనే కాకుండా దగ్గరగా ఉన్న వేరే షాపు వద్ద అయినా తీసుకోవచ్చన్నారు.

గుడ్లవల్లేరు : రేషన్ దుకాణాలలో ఒకటి నుంచి బియ్యం, పంచదార ప్రభుత్వం అందించే సరకుల పంపిణీ నిర్వహించనున్నారు. ఈ మేరకు శనివారం తహసీల్దార్ లోకరాజు, ఆర్ఐ హనుమంతరావు ఇతర రెవెన్యూ సిబ్బంది పలు రేషన్ దుకాణాలను పరిశీలించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ, ప్రతి నెలా ఒకటవ తేదీ నుంచి 15 తేదీ వరకు పంపిణీ నిర్వహిస్తారని ఆయన తెలిపారు.

గణనాథునికి ప్రత్యేక పూజలు



కూచిపూడి, మే 31 (ఆంధ్రజ్యోతి): కూచిపూడి అగ్రహారంలో రెండేళ్ల క్రితం ప్రతిష్ఠించిన విఘ్నేశ్వరుని విగ్రహానికి ద్వితీయ వార్షికోత్సవం పురస్కరించుకుని పలువురు చిన్నారులు స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి పంచా మృతాభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు.

రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా

పామర్రు, మే 31 (ఆంధ్రజ్యోతి) : రైతుల సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని, గడిచిన ఐదేళ్ల వైసీపీ పాలనలో పూర్తిగా నిర్లక్ష్యానికి గురైై కనీసం మరమ్మతులకు నోచుకోని పంటకాల్వలు, డ్రైనేజీలు, లాకుల గేట్లు పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తున్నామని ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా అన్నారు. ప్రభుత్వం విడుదల చేసిన రూ. 40 లక్షలతో అభివృద్ధి జరుగుతున్న స్థానిక బల్లిపర్రు లాకులు 14 గేట్ల మరమ్మతు పనులను శనివారం కూటమి శ్రేణులతో కలసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కరవురహిత రాష్ట్రంగా తీర్చిదిద్దాలనే ఆలోచనతో చంద్రబాబు నీటి ప్రాజెక్టుల నిర్మాణాలకు అంకురార్పణ చేశారన్నారు. బల్లిపర్రు లాకుల గేట్లు మరమ్మతులను త్వరితగతిన పూర్తిచేసి రాబోయే ఖరీఫ్ సాగులో నీటి విడుదలకు ఎలాంటి అవరోధాలు రాకుండా చూడాలని సంబంధిత కాంట్రాక్టర్లను కోరారు. ఈ కార్యక్రమంలో కురుమ ద్దాలి, పామర్రు సాగునీటి డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ కొసరాజు వేంకటేశ్వరరావు డీఈఈ భరత్, ఇన్‌చార్జి జేఈ బేగ్, మాజీ ఎంపీపీ గోట్టిపాటి లక్ష్మీదాసు, కుదరవల్లి ప్రవీణ్‌చంద్ర, మంతెన రామంజనేయులు, సుబ్రమణ్యం పలువురు రైతులు పాల్గొన్నారు.



పామర్రు పరిధిలోని బల్లిపర్రు లాకుల మరమ్మతులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా

క్షేత్రయ్య మందిరాన్ని ప్రారంభించటం అదృష్టం

కూచిపూడి : పద కవితా పితామహుడు క్షేత్రయ్య నడయాడిన మొవ్వలో ఆయన పేరు మీద ఆరాధన మందిరం ప్రారంభించటం అదృష్టంగా భావిస్తున్నట్లు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా పేర్కొన్నారు. మొవ్వ భీమేశ్వరస్వామి దేవాలయ సర్వ శ్రేయోనిధులు రూ.35 లక్షలు, దాతలు అందించిన విరాళాలు రూ.30 లక్షలతో కలపి రూ.65 లక్షలతో నిర్మించిన క్షేత్రయ్య ఆరాధన మందిరాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం జరిగిన సభలో మాట్లాడుతూ, ప్రసిద్ధి చెందిన మొవ్వ గ్రామాభివృద్ధికి ఇప్పటికే పలు ప్రతిపాదనలు రూపొందించామని, రానున్న రోజుల్లో అవి కార్యరూపం దాల్చుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవదాయ, ధర్మదాయ శాఖ జిల్లా సహాయ కమిషనర్ నూతక్కి వెంకట సాంబశివరావు, టీడీపీ మండల పార్టీ అధ్యక్షులు లింగమనేని రామలింగేశ్వరరావు, ఏఎంసీ చైర్మన్ దోనేపూడి శివరామయ్య, జడ్పీటీసీ సభ్యులు రాజులపాటి పార్వతీ, ఆలయ ఈవోలు డి.సుబ్బారెడ్డి, ఎస్.వి.సుబ్బారావు, తాతినేని పూర్ణచంద్రరావు, మండవ కోటేశ్వరరావు, రత్నగిరిరావు, శ్రీకృష్ణ, దేవాలయ అర్చకులు మొవ్వ రవి తదితరులు పాల్గొన్నారు.

మన ఊరు మన ప్రభుత్వం

పెదపారుపూడి : పామర్రు నియోజకవర్గాన్ని ప్రగతి పథంలో నిలపాలని ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా అన్నారు. పెదపారుపూడి అభివృద్ధి పర్యవేక్షణలో భాగంగా శనివారం వానపాముల కల్యాణ మండపంలో నిర్వహించిన ప్రగతి పథం పామర్రు అనే కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. టీడీపీ నాయకులు పూలమాలతో ఆయనకు తొలుత స్వాగతం పలికారు. ముందుగా ఎంపీడీవోగా విధులు నిర్వహిస్తున్న సాధిక్ పదవీ విరమణ చేయటంతో ఆయనను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రచార సమయంలో ప్రజలు అనేక సమస్యలు నా దృష్టికి తీసుకొచ్చారని,ఇప్పుడు ఆ సమస్యలు ఎంత మేరకు పరిష్కారమయ్యాయో తెలుసుకోవటం జరుగుతుందన్నారు. ఈ కార్యక్ర మంలో టీడీపీ మండల అధ్యక్షులు చలసాని రమేష్ చౌదరి (చంటి), ప్రధాన కార్యదర్శి మసీ ముక్కు రాంబాబు, జుజ్జువరపు భాను ప్రకాష్ (బాచి), వానపాముల గ్రామ టీడీపీ అధ్యక్షులు బసవయ్య, నీటి సంఘం అధ్యక్షులు చలసాని నవీన్ చౌదరి, కూచిపూడి శ్రీనివాసరావు, పామర్రు నియోజకవర్గ లీగల్ సెల్ నాయ కులు గొరిపర్తి రవికుమార్, సజ్జ శివయ్య, నరసింహారావు, చిలకా ఆంజనేయులు పాల్గొన్నారు.



పందిరి రాటాను ప్రతిష్ఠిస్తున్న టీడీపీ నాయకులు లింగం చిట్టిబాబు

వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల పందిరి రాటా ప్రతిష్ఠ

గుడివాడ, మే 31 (ఆంధ్రజ్యోతి) : స్థానిక పాటిమీద వేంచేసిఉయున్న వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో వార్షిక బ్రహ్మోత్సవాల పందిరి రాటాను శనివారం ప్రతిష్ఠించారు. ఈ నెల 6 నుంచి 11వ తేదీ వరకు కలియుగ ప్రత్యక్ష దైవం వేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహించనున్న నేపథ్యంలో పందిరి రాటా ప్రతిష్ఠ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి కందుల వేణుగోపాలరావు పేర్కొన్నారు. ఆలయ అర్చకులు వేదాంతం అపాచార్యుల మంత్రోచ్ఛరణతో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు లింగం చిట్టిబాబు, మాటూరి రంగనాథ్, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

ఉపాధి పనులు త్వరగా పూర్తి చేయాలి

గుడివాడ రూరల్, మే 31 (ఆంధ్రజ్యోతి) : ఉపాధి హామీ పథకం పనులు త్వరగా పూర్తి చేసి లక్ష్యాలను అందుకోవాలని ఎంపీడీవో డి.వై.విష్ణుప్రసాద్ అన్నారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో అధ్యక్షతన ఉపాధి హామీ పథకం, యోగా డే కార్యక్రమాలపై సమీక్షా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ, ఏ రోజు చేయాల్సిన పనిని ఆ రోజు రికా ర్డుల్లో నమోదు చేసి మండల పరిషత్ కార్యాలయానికి అందజే యాలన్నారు. జూన్ 2వ తేదీన 5 వేల మందితో మెగా యోగాడే నిర్వహిస్తున్నందున ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొనాలని తెలి పారు. ఎన్టీఆర్ స్టేడియంలో జరిగే యోగా దినోత్సవాన్ని జిల్లా స్థాయిలో నిర్వహిస్తున్నందున అందరూ తప్పనిసరిగా హాజరు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఈవో పీఆర్డీ ఎస్.శ్రీని వాసరావు, ఉపాధి హామీ అధికారి రామకృష్ణ, ఫీల్డ్‌అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో ప్రసంగిస్తున్న ఎంపీడీవో డి.వై.విష్ణుప్రసాద్

ఒకరోజు ముందుగానే పింఛన్లు అందజేత

పామర్రు, మే 31 (ఆంధ్రజ్యోతి) : పేదలకు ఇచ్చిన వాగ్దానం మేరకు అధికారంలోకి వచ్చిన నాటి నుంచే కూటమి ప్రభుత్వం పింఛన్ల లబ్ధిని పెంచి ఒకరోజు ముందుగానే లబ్ధిదారులకు అందిస్తున్న ఘనత కూటమి ప్రభుత్వానిదే నని ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా అన్నారు. శనివారం పామర్రు ఆర్‌హెచ్ నగర్ కాలనీలో లబ్ధిదారులకు ఎన్టీఆర్ భరోసా పింఛన్లు స్థానిక నేతలతో కలసి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు పిన్నిబోయినశ్రీనివాసరావు, పి.సుబ్రమణ్యం, మంతెన రామంజనేయులు, చాట్ల రమేష్ పాల్గొన్నారు.

గుడ్లవల్లేరు : గుడ్లవల్లేరు మండలంలో పింఛన్ల పంపిణీ శనివారం గ్రామగ్రామానా సచివాలయ సిబ్బంది, కార్యదర్శులు, టీడీపీ నాయకులు కలిసి పంపిణీ చేశారు. 93 శాతం పంపిణీని పూర్తి చేశామని ఎంపీడీవో టి.విజయసారధి తెలిపారు.

● ఆదివారం ఉదయం గుడివాడ ఎన్.టి.ఆర్ స్టేడియంలో నిర్వహించనున్న యోగాంధ్ర కార్యక్రమంలో గుడ్లవల్లేరు మండలంలో యువకులు, ప్రజలు ఆసక్తి గలవారు పాల్గొనాలని ఎంపీడీవో విజయసారధి పిలుపునిచ్చారు. నియోజకవర్గ స్థాయిలో ఈ కార్యక్రమం నిర్వహిచనున్నారని ఆయన తెలిపారు. గ్రామపంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొనున్నారని ఆయన తెలిపారు.



కొండిపాలెంలో ఇంటివద్దే వృద్ధులకు పింఛన్లు అందజేస్తున్న టీడీపీ వడ్లమాన్నాడు అధ్యక్షుడు సత్తిబాబు

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	122, 131, 142
చికెన్ విత్ స్కిన్	234
చికెన్ స్కిన్‌లెస్	244

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 510

అబ్బురపరిచిన శిరీష యోగాసనాలు



మచిలీపట్నం టౌన్, మే 31 (ఆంధ్రజ్యోతి) : మంగినపూడిబీచ్‌లో శనివారం ఉదయం నిర్వహించిన మెగా యోగా ప్రదర్శనలో టేకుమూడి శిరీష వేసిన యోగాసనాలు ఆహూతులను అబ్బురపరిచారు. 2015 నుంచి జాతీయ స్థాయిలో పతకాలు సాధిస్తున్న శిరీషను ఈ సందర్భంగా పలువురు అభినందించారు. మంత్రి కొల్లు రవీంద్ర, జిల్లా కలెక్టర్ బాలాజీ ఆమె ప్రత్యేకంగా అభినందించారు.

నేటి నుంచి షాపుల్లోనే రేషన్ పంపిణీ

బంటుమిల్లి, మే 31(ఆంధ్రజ్యోతి): నిత్యావసర సరుకులు ఆదివారం నుంచి రేషన్ షాపులో పంపిణీ జరుగుతుందని తహసీల్దార్ కాగిత పూర్ణచంద్రరావు అన్నారు. ఉదయం 8నుంచి మధ్యాహ్నం ఒంటి గంట, సాయంత్రం 4 నుంచి రాత్రి 8గంటల వరకు రేషన్ షాపులు తెరిచే ఉంటాయన్నారు. 65 సంవత్సరాలు నిండిన వృద్ధులు, దివ్యాంగులకు ప్రతి నెలా 5వ తేదీలోపు నేరుగా ఇంటి వద్దకు వెళ్లి నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తారని తెలిపారు. మార్పులను ప్రతి ఒక్కరూ గమనించగలరని తహసీల్దార్ కోరారు.

రేషన్ షాపులు ముస్తాబు

పెడన : పట్టణంలోని 15 రేషన్ షాపుల డీలర్లు తమ షాపులను అలంకరించే పనుల్లో నిమగ్నమయ్యారు. అధికారులు డీలర్లకు ఫ్లెక్సీ బ్యానర్లు అందజేశారు. తొలి రోజు రేషన్ తీసుకునే కార్డు దారులకు స్వీట్లు కూడా పంచి పెడతారు. ఈ ముఖ్యఅతిథులుగా ప్రజాప్రతినిధులు హాజరుకానున్నారు.



మంత్రి కొల్లు రవీంద్రకు సత్కారం

మచిలీపట్నం టౌన్, మే 31 (ఆంధ్రజ్యోతి) : మహానాడు కార్యక్రమం ఘనంగా నిర్వహించిన మంత్రి కొల్లు రవీంద్రను శనివారం ప్రజాదర్బార్‌లో టీడీపీ నాయకులు ఘనంగా సత్కరించారు. రవీంద్ర నాయకత్వంలో మచిలీపట్నంలోనే కాకుండా కడప మహానాడులో కార్యక్రమాలు విజయవంతమయ్యేందుకు కృషి చేసిన మంత్రిని నాయకులు లోగిశెట్టి వెంకటస్వామి, బత్తిన దాసు, బోయిన రాజు, బచ్చుల అనిల్ కుమార్ సత్కరించారు.

మంత్రిని కలిసిన సమగ్ర శిక్ష ఏపీసీ

నూతనంగా బాధ్యతలు స్వీకరించిన సమగ్ర శిక్ష ఏపీసీ కుముద్విని శనివారం మంత్రి కొల్లు రవీంద్రను మర్యాద పూర్వకంగా కలిసి మొక్క అందజేశారు. ఈ సందర్భంగా ఏపీసీతో జిల్లాలోని పాఠశాలల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆయన సూచించారు.

పెన్షన్‌తో లబ్ధిదారులకు భరోసా

పింఛన్ల పంపిణీలో ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్



విశ్వనాథపల్లి శ్రీనివాసరావు దంపతులను సత్కరిస్తున్న ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ తదితరులు

కోడూరు, మే 31 (ఆంధ్రజ్యోతి): కోడూరు నరసింహపురం రోడ్డులోని మార్కెట్‌లో స్పౌజ్ పింఛను పంపిణీలో ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ పాల్గొన్నారు సకాలంలో పెన్షన్ అందిస్తూ ప్రభుత్వం భరోసా కల్పిస్తోందన్నారు. కార్యక్రమంలో ఏపీ అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ చిలకలపూడి పాపారావు, పీసీ చైర్మన్ దేవన బోయిన వెంకటేశ్వరరావు, ఎంపీడీవో సుధా ప్రవీణ్, డిజిటల్ అసిస్టెంట్ మణింద్ర, జనసేన నాయకులు పాల్గొన్నారు.

గూడూరు : నారికేడలపాలెం, గూడూరు గ్రామాల్లో శనివారం డీసీ చైర్మన్ పోతన స్వామి, కూటమి నాయకులు పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా స్వామి మాట్లాడుతూ, ఒక రోజు ముందుగానే ప్రభుత్వం పింఛన్లు పంపిణీ చేయడంతో పెన్షన్‌దారులు కృతజ్ఞతలు తెలియచేస్తున్నారన్నారు. తెలుగుయువత కార్యదర్శి ఎస్ఏ బేగ్, మాజీ సర్పంచ్ పోతన రామోజీ, క్లస్టర్ ఇన్‌ఛార్జి బొర్రా శ్రీను, బాసంశెట్టి విజయ్, రాసంశెట్టి దుర్గారావు, బచ్చుల రామాంజనేయులు, ఎండీ యూనస్, బి.స్వామి, ఎన్. కిరణ్, జన్ను జగన్ తదితరులు పాల్గొన్నారు.

నాగాయలంక: ప్రభుత్వం పేదల సంక్షేమం కోసం నిరంతరం పని చేస్తుందని టీడీపీ వాణిజ్య విభాగం రాష్ట్ర నాయకుడు చిట్టా వీర అన్నపూర్ణయ్య అన్నారు. శనివారం నాగాయలంకలో దివ్యాంగులకు, వృద్ధులకు పింఛన్లను సచివాలయ సిబ్బందితో కలసి పంపిణీ చేశారు.

సేవాభావం స్ఫూర్తిదాయకం : మండలి

కోడూరు: సేవాభావం స్ఫూర్తిదాయకం అని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. జనసేన పార్టీ కోడూరు టౌన్ అధ్యక్షుడు కోట రాంబాబు ఆధ్వర్యంలో శనివారం జేకే ఇన్‌ఫ్రా వాటర్ ట్యాంకర్‌ను ప్రారంభించారు. తొలి రోజు ఉల్లిపాలెం, హంసలదీవి ఎస్సీ కాలనీలకు తాగునీరును అందజేశారు.

విద్యార్థినికి ప్రోత్సాహకం

అవనిగడ్డ: కోడూరు ఎస్సీ కాలనీకి చెందిన పదో తరగతి విద్యార్థిని బత్తుల ప్రవల్లికకు ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ రూ.10 వేలు ప్రోత్సాహకం అందించారు. ఎస్సీ విద్యార్థులకు దివిసీమ భీమ్ జీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రతీ సంవత్సరం రూ.10 వేలు ప్రోత్సాహం అందిస్తున్నారు. ఈ ఏడాది 578 మార్కులు సాధించిన విద్యార్థినికి అందించారు. నిర్వాహకులు పోలాబత్తిన బిపిన్ చంద్రపాల్ మెరిట్ విద్యా ర్థులకు నగదు ప్రోత్సాహం అందించటం అభినందనీయమన్నారు. అసోసియేషన్ అధ్యక్షుడు పోలాబత్తిన గోపాలం పాల్గొన్నారు.

ఉద్యోగికి పదవీ విరమణ తప్పనిసరి

కోడూరు: ప్రభుత్వ ఉద్యోగికి పదవీ విరమణ తప్పనిసరిఅని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ టి.కల్పలత అన్నారు. కోడూరు ఆర్యవైశ్య మందిరంలో శనివారం కోడూరు మండల విద్యాశాఖ అధికారి-2 విశ్వనాథపల్లి శ్రీనివాసరావు పదవీవిరమణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హెచ్ఎంగా, ఎంఈవోగా విధులు నిర్వహించి అందిర మన్ననలు పొందారన్నారు. మండల విద్యాశాఖ అధికారులు, ప్రభుత్వ ఉపాధ్యాయ సంఘ నేతలు సేవలను కొనియాడారు. విశ్వనాథపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రతీ ఒక్కరూ సహకరించారన్నారు. అనంతరం శ్రీనివాసరావు - సూర్యకుమారిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో అగ్నికుల క్షత్రియ వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ చైర్మన్ చిలకలపూడి పాపారావు, పీసీ చైర్మన్ డి.వెంకటేశ్వరరావు, ఎంఈవో రామదాసు, ఉపాధ్యాయ సంఘాల నేతలు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో మీ పిల్లలను చేర్పించండి

ఉపాధ్యాయుల వినూత్న ప్రచారం



హెచ్ఎం కైతేపల్లి దాస్, కళాకారులు, ఉపాధ్యాయులు డప్పు వాయిస్తూ వినూత్న ప్రచారం

చల్లపల్లి, మే 31 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పిల్లలకు అందే ప్రయోజనాలు, సౌకర్యాలపై చల్లపల్లి నారాయణరావు మోడల్ పాఠశాల హెచ్ఎం, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయుడు కైతేపల్లి దాస్, ఉపాధ్యాయులతో కలిసి వినూత్న ప్రచారం చేపట్టారు. వేసవి సెలవుల్లో ఇంటింటి ప్రచారం చేస్తూ ప్రవేటు పాఠశాలలకు వెళ్లే విద్యార్థులను సైతం ప్రభుత్వ పాఠశాలలవైపు ఆకర్షించేలా కృషి చేస్తున్నారు. డప్పు కళాకారులతో ప్రభుత్వ విద్యపై ప్రచారం చేపట్టగా, కైతేపల్లి దాస్ సైతం డప్పు కళాకారుని వేషధారణలో డప్పు కొడుతూ ప్రచారం చేశారు. కరపత్రాలను తల్లిదండ్రులకు అందించి ప్రభుత్వ పాఠశాలల్లో సౌకర్యాలపై వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాధారాణి, దుర్గాప్రసాద్, డప్పు కళాకారుడు చాట్రగడ్డ శ్రీనివాసుడు, తమ్మన ప్రసాద్, కరీముల్లా, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలకు కిట్లు పంపిణీ



మోపిదేవి: ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర పథకంలో భాగంగా విద్యాకిట్ల పంపిణీ శనివారం ప్రారంభించారు. ఎమ్మార్సీ కార్యాలయంలో ఎంఈవో అన్నపరెడ్డి పిచ్చియ్య ఉపాధ్యాయులకు కిట్లను అందజేశారు. యూనిఫాం, బెల్టులు, నోటు పుస్తకాలు, టెక్స్ట్ బుక్స్, డిక్షనరీలు అందించారు. ఎంఈవో మాట్లాడుతూ 12వ తేదీన పాఠశాలలు పునఃప్రారంభం రోజునే వాటిని విద్యార్థులకు అందించాలన్న ప్రభుత్వ లక్ష్యాన్ని అమలు చేయాలని స్కూల్స్ హెచ్ఎంలకు సూచించారు. సీఆర్పీలు ధనరాజు, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పంటల సాగులో యాజమాన్య పద్ధతులు తప్పనిసరి



రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్త మంజువాణి

మోపిదేవి, మే 31 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ రంగంలో సాగు చేసే పంటల్లో యాజమాన్య పద్ధతులు ప్రధానమని కృషి విజ్ఞాన కేంద్రం ఉద్యాన శాస్త్రవేత్త డాక్టర్ వి.మంజువాణి అన్నారు. వికసిత్ కృషి సంకల్ప అభియాన్‌లో భాగంగా శనివారం మేళ్లమర్తిలంకలో రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పసుపు, కంద, కూరగాయలు, ఆయిల్ పామ్‌లలో అధికదిగుడి ఇచ్చే రకాలను సాగు చేసుకోవాలన్నారు. చెరకు పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ విజయభాస్కర్ రెడ్డి, ఏవో హెబ్సిబా రాణి తదిత రులు పాల్గొన్నారు.

బహిరంగ ప్రకటన

నా క్లయింట్ కృష్ణాజిల్లా, చల్లపల్లి మండలం, యార్లగడ్డ గ్రామ కాపురస్తుడు బొబ్బా కృష్ణారావు గారి కుమారుడు బొబ్బా దేవిప్రసాద్ గారు నాకు ఇచ్చిన సంజాయిషీ ప్రకారము. యావన్మందికి తెలియజేయునది ఏమనగా.

నా క్లయింట్ తన తాత గారైన బొబ్బా ప్రకాశరావు గారి వద్ద ది. 26-09-2018 తారీఖున చల్లపల్లి మండలం, యార్లగడ్డ గ్రామంలో ఆర్.యస్.నెం.41-3, 52-1, 52-2, 68 & 266 నందు గల య.6-10ట్లు మాగాణి భూమి మరియు ఆర్.యస్.నెం. 295-5 నందు 16 సెంట్లు (రెండు 8 సెంట్లు భాగాలు వెరశి య.0-16 సెంట్లు) ఇంటి స్థలం మరియు పురిటిగడ్డ గ్రామంలోని ఆర్.యస్.నెం. 16-1ఎ, 15-1 నందు గల య.5-051/2ట్లు మాగాణి భూమిని అదే రోజున అనగా ది.26-09-2018వ తేదీన చల్లపల్లి సబ్ రిజిస్ట్రార్ ఆఫీసు నందు దస్తావేజు నెం. 73/2018రు గల వీలునామా నా క్లయింటు పేరున రిజిస్ట్రేషన్ చేయించియున్నారు. నా క్లయింటు బొబ్బా దేవి ప్రసాద్ గారు సదరు ఒరిజినల్ వీలునామా డాక్యుమెంటు జిరాక్స్ తీయించుకునే నిమిత్తం ది.24-05-2025వ తేదీన తన ఇంటి నుండి చల్లపల్లి గ్రామం మెయిన్ సెంటర్‌కి వెళ్ళుచుండగా సదరు ఒరిజినల్ వీలునామా డాక్యుమెంట్ పోయినది. పైన పేర్కొనబడిన ఒరిజినల్ డాక్యుమెంట్ ఎవ్వరికైనా దొరికిన యెడల నా క్లయింటుకు గానీ లేదా ఈ క్రింది అడ్రస్సు గానీ అందజేయవలసినదిగా కోరుచున్నాను.

చల్లపల్లి, ది.31-05-2025

ఇట్లు, **కొడాలి మురళీ, అడ్వకేట్,**
చల్లపల్లి, కృష్ణాజిల్లా - 521126
సెల్: 94405 39563

పదిలో ప్రతిభ చూపిన విద్యార్థినులకు నగదు ప్రోత్సాహకాలు

పెడన, మే 31 (ఆంధ్రజ్యోతి) : పదో తరగతి పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థినులకు పుప్పాల నరసింహారావు, లీలావతి దంపతుల జ్ఞాపకార్థం వారి కుమారులు వరప్రసాద్, ధనుంజయ్, నరేష్ శనివారం నగదు ప్రోత్సాహకాలను అందించారు. 589 మార్కులు సాధించి ప్రథమంగా నిలిచిన పుప్పాల భువనేశ్వరికి రూ.20వేలు, 582తో ద్వితీయ స్థానంలో నిలిచిన యర్రంశెట్టి జాహ్నవికి రూ. 15వేలు, 579మార్కులతో తృతీయ స్థానం సాధించిన కొండవీటి రేవతికి రూ.10వేలు అందజేశారు. విశ్రాంత హిందీ మాస్టర్ వెంకటేశన్ వీరికి రూ.10వేల చొప్పున అందించారు. డ్రిల్ మాస్టర్ భాష్యం రూ. 1116 చొప్పున అందించారు. హెచ్ఎం సిద్ధినేని సౌజన్య, ఎస్ఎంసీ కమిటీ చైర్మన్ ఉద్దగిరి రాఘవులు, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయేతర సిబ్బంది పాల్గొన్నారు.

పొగాకు వ్యతిరేక దినోత్సవంపై అవగాహన



ప్రతిజ్ఞ చేస్తున్న అధ్యాపకులు, విద్యార్థులు

అవనిగడ్డ, మే 31 (ఆంధ్రజ్యోతి): పొగాకు వ్యతిరేక దినోత్సవంపై అవగాహన సదస్సు శనివారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం జాతీయసేవా పథకం యూనిట్-1 ప్రొగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ ఎ.వీరకుమారి ఆధ్వర్యంలో జరిగింది. విద్యార్థులు, అధ్యాపకేతర సిబ్బందితో పొగాకు వ్యతిరేక ప్రతిజ్ఞ చేయించారు. టొబాకో వాడటం వల్ల మానవ శరీరానికి కలిగే అనర్థాలను ప్రయోగం ద్వారా వివరించారు. పొగాకు వల్ల కలిగే అనర్థాలపై అభిప్రాయ సేకరణ ఆన్‌లైన్ సర్వే పోల్ నిర్వహించారు. ప్రిన్సిపాల్ డి.ఉమారాణి పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వైభవంగా నవగ్రహాల ప్రతిష్ఠ



మచిలీపట్నం టౌన్, మే 31 (ఆంధ్రజ్యోతి) : దొంతులమ్మ దేవాల యంలో శనివారం వైభవంగా నవగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం జరిగింది. వేదపండితుడు లొల్లా కుటుంబశాస్త్రి బ్రహ్మత్వంలో నిర్వహించిన కార్యక్రమంలో వీరంకి వెంకటసుబ్బారావు, వీరంకి శ్రీనివాసమెహర్, విజయశిల్ప పీటల మీద కూర్చుని నిర్వహించారు

3 నుంచి ఆధ్యాత్మిక కార్యక్రమాలు

అవనిగడ్డ రూరల్ : తుంగలవారిపాలెంలో 3వ తేదీ నుంచి టీటీడీ హిందూ ధర్మ ప్రచార పరిషత్ కృష్ణా జిల్లా శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తున్న అన్నపరెడ్డి కృష్ణ శనివారం తెలిపారు. కోదండ రామాలయంలో కరపత్రాలు ఆవిష్కరించారు. సింహాద్రి పద్మ, గరికిపాటి వీరాంజనేయులు, లింగం బసవ శంకర్‌రావు, పండితులు దీవి మురళీకృష్ణ పాల్గొన్నారు.

ఆలయాల నిర్మాణానికి శంకుస్థాపన



నాగాయలంక : మర్రిపాలెంలోని పురాతన దేవాలయాలు శ్రీకృష్ణ మందిరం, శ్రీ ఆంజనేయ స్వామి పునర్నిర్మాణానికి శనివారం వేదపండితులు శంకుస్థాపన చేశారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. కార్యక్రమంలో మెండు లక్ష్మణరావు, ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

శివరామకృష్ణ క్షేత్రానికి విరాళం

కోడూరు: కోడూరులో పునర్నిర్మాణం చేస్తున్న శివరామకృష్ణ క్షేత్రానికి యర్రారెడ్డివారిపాలెం గ్రామానికి చెందిన సనకా శంకరరావు రూ.1,05,319 విరాళాన్ని శనివారం అందించారు. సహకారం అందించిన శంకరరావు కుటుంబసభ్యులను సభ్యులు అన్నం వెంకట సుబ్బారావు, బూరగడ్డ హరినాథ్ బాబు, జూపూడి సుభాష్ చంద్రబోస్, బడే భావన్నారాయణ తదితరులు సత్కరించారు.

భగవద్గీత పోటీల్లో ఏడుగురికి బంగారు పతకాలు



పెడన, మే 31 (ఆంధ్రజ్యోతి) : భగవద్గీత పోటీల్లో పెడనకు చెందిన ఏడుగురికి బంగారు పతకాలు లభించాయి. అవధూత దత్తపీఠాధిపతి శ్రీ గణపతి సచ్చిదానంద స్వామిజీ పుట్టిన రోజు సందర్భంగా ఆన్‌లైన్‌లో నిర్వహించిన పోటీల్లో పెడనకు చెందిన చిట్టూరి ధరణి, తమ్మన అన్నపూర్ణ, ధనలక్ష్మి, జల్లూరి శిరీష, మామిడి లావణ్య, భానుదత్త, వెంకటదత్త బంగారు పతకాలు సాధించారు. వీరికి ఆర్యవైశ్య సంఘాల ఆధ్వర్యంలో సత్కారం జరిగింది. ఆర్యవైశ్యుల పరిరక్షణ సమితి వ్యవస్థాపకుడు కొల్లూరి చిన్నా, ఆర్యవైశ్య మహాసభ సేవా కార్యక్రమాల కమిటీ చైర్మన్ మామిడి ప్రసాద్, వాసవీ క్లబ్ అధ్యక్షురాలు కొమ్మూరి విజయదుర్గ, వాసవీ మహిళా మండలి అధ్యక్షురాలు తమ్మన లక్ష్మీతాయారు పాల్గొన్నారు.

గుడిలోకి దూసుకుపోయిన ట్రాక్టర్



పెడన, మే 31 (ఆంధ్రజ్యోతి) : ట్రాక్టర్ గుడిలోకి దూసుకెళ్లిన ఘటన నడుపూరు గ్రామ పరిధిలో శనివారం చోటు చేసుకుంది. గూడూరు పంచాయతీ కృష్ణాపురం గ్రామానికి చెందిన వేముల లక్ష్మణుడు శనివారం ఉదయం బుసక లోడుతో ట్రాక్టర్‌పై వేగంగా వెళుతుండగా నడుపూరు నాగేంద్రస్వామి గుడి వద్ద గేదె అడ్డంవచ్చింది. దానిని తప్పించబోయి నాగేంద్రస్వామి గుడిలోకి ట్రాక్టర్ దూసుకుపోయింది. ఈ ఘటనలో గుడి గుమ్మం, గోడ, గుడిలోని పుట్ట ధ్వంసమయ్యాయి. డ్రైవర్ లక్ష్మణుడుకు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం బందరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఎస్సై సత్యనారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.